తాతా రమేశ్‌బాబు
కోదాడ
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2 కృష్ణకీరోడ్ గుడివాడ
Cell : 9441518715

MUKKAKALAPRADEEP KUMAR

# ప్రేమ



తాతా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ
Cell : 9441518715

శ్రీ శ్రీ

# ఖడ్గసృష్టి

M. Pradeep Kumarji
P.P.C
Narasaraopet

విశాలాంధ్ర ప్రచురణాలయం
విజయవాడ–2

ప్రచురణ నెం. 593

ప్రథమ ముద్రణ :

ఫిబ్రవరి '1966

వెల : 2-50

ముద్రణ :

రమణా ప్రింటర్స్,

విజయవాడ-1.

# ఖడ్గసృష్టి

రెండురెళ్ళు నాలుగన్నందుకు
గూండాలు గండ్రాళ్ళు విసిరే సీమలో
క్షేమం అవిభాజ్యం అంటే
జైళ్ళు నోళ్ళు తెరిచే భూమిలో

అస్వతంత్రతని జయించడానికి
అహింసాయుధం ధరించమంటూ
రక్తపాతం లేకుండానే
రాజ్యం సంపాదించామంటూ

అవినీతి భారీపరిశ్రమలో
అన్యాయాల ధరలు పెంచేసి
స్వాతంత్ర్యాన్ని బ్యాంకుల్లో వేసుకుని
చక్రవడ్డీ తిప్పే కామందులకు

క్షణ క్షణం మారుతూన్న లోకాన్ని
సరీగా అర్థంచేసుకున్న వాళ్ళంతా
పేదప్రజల పక్షం వహించడమే
పెద్ద అపరాధమై పోయింది.

అహింస ఒక ఆశయమే కాని
ఆయుధం ఎప్పుడూ కాదు
ఆశయం సాధించాలంటే
ఆయుధం అవసరమే మరి.

ఆశయం ఉండడం మంచిదే కాని
అన్ని ఆశయాలూ మంచివి కావు
ఆశయాలు సంఘర్షించే వేళ
ఆయుధం అలీనం కాదు

అందుకే అంటున్నాను నేను
అందుకో ఆయుధం అని
ఆచరణకి దారితీస్తేనే
ఆవేశం సార్థకమవుతుంది.

అందుకే సృష్టిస్తున్నాను
అధర్మనిధనం చేసే ఈ ఖడ్గాన్ని
కలంతో సృష్టిస్తున్న ఖడ్గం ఇది
జనంతో నిర్మిస్తున్న స్వర్గం ఇది

ఈ కత్తి
బూజుపట్టిన భావాలకి
పునర్జయం ఇవ్వడానికి కాదు
కుళ్ళిపోతున్న సమాజవృక్షాన్ని
సమూలచ్ఛేదం చెయ్యడానికి

దీన్ని
నల్లబజారు గుండెల్లో దించు
దీనితో
కల్లకపటాలను వధించు

ఇది
సమాన ధర్మాన్ని స్థాపిస్తుంది
నవీనమార్గాన్ని చూపిస్తుంది
ఈ కత్తి
ఊహాసమూహాల వ్యూహాలు పన్ని
వీరవిహారం చేస్తూ
రణక్షోణిలో
జనాక్షౌహిణులు కదలడానికి

అందుకే రాస్తున్నా నొకగీతి
చేస్తున్నా నొక హేతి
రావోయి లోనికి
సందేహం దేనికి ?

ఇది నిజం
నవధర్మం మానవధర్మం
ఆణవశక్తి కన్న
మానవశక్తి మిన్న

రావోయి రావోయి లోనికి
సంకోచం దేనికి
నను చూడగా ఇదేవేళ
నా మనః కార్మిక శాల

క్రక్కేది భావాగ్ని నెగలు
క్రమ్మేది దావాగ్ని పొగలు

రావోయి రావోయి లోనికి
రానేది రవ్యుష్ణ గీతి
చేనేది పవ్యుగ్ర హేతి

గరళపు ముద్ద లోహ మువ
గాధ మహాశని కోట్లు సమ్మెటల్
హరు నయనాగ్ని కొల్మి ఉర
గాధిపు కోరలు పట్టుకొర్లు ది
క్కరటి శిరమ్ము దాయ లయ
కొలుడు కమ్మరి వైరి వీర సం
హరణ గుణాభిరాముడగు
మైలమభీమన "ఖడ్గసృష్టి"కిన్

# అంకితం

తెలుగు "వాడి"కి

తాతా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ
Cell : 9441518715

# శరచ్చంద్రిక

నవీన విశ్వవిద్యాలయాల్లో
పురాణ కవిత్వంలాగా
శ్రవణ యంత్రశాలల్లో
శాస్త్రీయ సంగీతం లాగా
ఇలా వచ్చేవేం వెన్నెలా ?
ఎలా వర్ణించను నిన్ను ?
మహాకవులు లోగడ చెప్పిందే
మళ్ళీ మళ్ళీ చెప్పాలా ?

ఏదోకొత్త భాషాజ్ఞానం
ఇంతో అంతో చ్ఛందస్సంపదా
ఐదో పదో అలంకారాలు
అరో, అందులోసగమో ఆవేశం

ఇలాంటివే ఏవో పోగుచేసి
ఇదివరకు నిన్నెప్పుడూ చూడనట్లు
ఇవ్వాళే కొత్తగా కనిపెట్టినట్లు
ఏమని వర్ణించను నిన్ను ?

ఏదిరాసినా ఏం లాభం ?
ఇదివరకెవడో అనే వుంటాడు
బహుశా ఆ అన్నదేదో నాకన్నా
బాగానే అని వుండొచ్చు.

అలాంటప్పుడు మళ్ళీ
కలం కాగితం మీద పెట్టి
కళంకంలేని తెల్లదనాన్ని
ఖరాబు చెయ్యడ మెందుకు ?

అనాదినుంచీ నువ్వు
అంతమంది కవులకీ
ఉపాదేయ వస్తువుగా నిలిచి
ఉపకారం చేశావు.

అలాగే నేనూ ఒకప్పుడు
రొమాంటిక్ ప్రమాదంలో పడి
అమాయకంగా నీ బ్యూటీ
అభివర్ణించాను వృత్తాల్లో

ఇవాళ మళ్ళీ అలాగ
ఎలాగ రాయగలను నేస్తం ?
ఇరవయ్యో ఏడు నాకు మళ్ళీ
ఎలా వస్తుంది చెప్పూ ?

అంచేత నీ గురించి
అనవసరావేశాలు పెంచి
అన్యాపదేశంగానో లేదా
అర్థాంతరన్యాసంగానో

సొంత కోపాలేవో పెట్టుకొని
పంతాలూ పట్టింపులూ పట్టుకొని
ఎవరినీ ఈ వ్యవహారంలో
ఇరికించ దలచుకోను నేను !

ఇంతకీ ఆవేశాల కేముంది ?
ఎవడి బతుకు వాడు బతుకుతున్నాడు
ఎంతగా ఎడం ఎడంగా ఉన్నా
ఎంతగా పైపై భేదాలున్నా
ఎంతగా స్వాతిశయం పెరిగినా
ఎంత బలం ధనం జవం పెరిగినా
అంతరంగం అట్టడుగునమాత్రం
అంతమంది మీ మానవులమే !

అందుచేత ఓ చందమామా !
అందమైన ఓ పూర్ణసోమా !
సముద్రం మీదా అరణ్యం మీదా
సమానంగా ప్రకాశించే సౌందర్యాభిరామా !

(అదుగో మళ్ళీ కవిత్వం =
అనుకున్నాను మొదటే నేను
వెన్నెల పేరెత్తితే చాలు
వేర్రెత్తి పోతుంది మనస్సు)

అన్నట్టు ఏమిటి చెప్మా
అందామని అనుకున్నాను
ఏమీలేదు; ఏమీ లేదనే
ఇంత సేపూ చెబుతున్నాను.

చెప్పొచ్చిందేమిటంటే
చెప్పడాని కేమీ లేదని :
అంతమందికీ అన్నీ తెలుసు
అదే మన అజ్ఞానం.

ఎవడో చెబితే విన్న రోజులు
ఏనాడో వెళ్ళిపోయాయి
ఇంకా ఏదో చెప్పాలని
ఎందుకీ ఉబలాటం ?
అసలు నిజం ఏమిటంటే
ఎవడికీ ఏమీ తెలియదు
ఇలా ఎందుకొచ్చామో
ఇక్కడెంత సేపుంటామో
ఇక్కడినుంచి వెళ్లేదెక్కడికో
ఎల్లుండి ఏ తమాషా జరుగుతుందో
ఎవ్వడూ చెప్పలేడంటే నమ్మండి
చెబితేమాత్రం నమ్మకండి !

కాళ్ళకింద భూమి
కరిగిపోతున్నప్పుడు
పూర్వం వేసిన పునాదులు
కదిలి పోతున్నప్పుడు
మనిషికీ మనిషికీ మధ్య
మాయపొరలు కప్పినప్పుడు
మనసుకీ మనసుకీ మధ్య
మంచుతెరలు కమ్మినప్పుడు

ఏ నక్షత్రానికి తగిలించాలి
ఈ మనవిషాద శకటాన్ని ?
ఎవరు మళ్ళీ అతుకుతారు
ఈ విరిగిన జీవితశకలాల్ని ?

అంతా అగమ్యగోచరం
అంతా అరణ్య రోదనం
ద్వేషం ఇచ్చే పర్సెంటేజి
ప్రేమం ఎలా ఇవ్వగలదు ?

కష్టపడి ఆర్జించిన స్వాతంత్ర్యం
గద్దలు తన్నుకుపోతాయి,
కంచిమేక పాపం ఎప్పుడూ
కసాయివాణ్ణే నమ్ముకుంటుంది.

ఇంతకీ ఈ భూమికి
ఏమాత్రం ఈడొచ్చిందని
సగటు మానవుడి వయస్సు
పదకొండో, పన్నెండో ?

ఈ కుర్రాళ్ళని చూసి
ఎందుకలా నవ్వుకుంటావు
మబ్బుతునక జేబురుమాలు
మాటుచేసుకొని, జాబిల్లీ!

మానవుడు పెరుగుతున్నాడు
పరిసరాల నర్థంచేసుకుంటున్నాడు
ప్రకృతి శక్తులను జయిస్తూ
ఘన విజయాలు సాధిస్తున్నాడు.

ఏదో నిరాశగా నేను
ఇంత నేపూ వాగానుకదూ?
ఇంకో వేపునించి చూస్తే
ఎంతపెలుగు కనబడుతుందో!

ఏమో బహుశా త్వరలో
మీ ఇంటికే రావచ్చు మేము
స్వాగతం ఇస్తావుకదూ
ఆతిథ్యాని కర్హులమే మేము

చంద్రమండలానికి ప్రయాణం
సాధించరాని స్వప్నంకాదు
గాలికన్న బరువైన వస్తువుని
నేలమీద పడకుండా నిలబెట్టలేదూ?

పరమాణువు గర్భంలోని
పరమ రహస్యాలూ
మహాకాశ వాతావరణంలోని
మర్మాలూ తెలుసుకున్నాక

సరాసరి నీదగ్గరకే
ఖరారుగా వస్తాంలే
అప్పుడు మా రాయబారుల్ని
ఆదరిస్తావుకదూ నువ్వు ?

చిరకాలం అజేయంగావున్న
ఎవరెస్టు ఇటీవలే లొంగింది
చికిత్స లేదనుకున్న వ్యాధులు
చిత్తగిస్తున్నాయి పరారీ
పదార్థ విజ్ఞానశాస్త్రం
అమోఘంగా వికసిస్తోంది
ప్రాణం స్వభావం ఏమిటో
పరిశోధనలు సాగుతున్నాయి.

మహానదుల గమనాలను
మళ్ళించ గలుగుతున్నాం
ఉత్తర ధ్రువంలో వ్యవసాయం
ఒకప్పుడు జరిగి తీరుతుంది.

సంహారం సంగ్రామం అంటే
జనంలో అసహ్యం పుట్టింది
ప్రశాంతంగా జీవించాలని
ప్రజలంతా ఆశిస్తున్నారు.

ఇదీ మా భూలోకం కథ
ఇదీ మానవుడి ProgressReport
ఇందులో అతిశయోక్తులేవీ లేవని
ఎవరైనా ఒప్పుకుంటా రనుకొంటా.

అంతా బాగానేవుందనీ
అంతా సుఖంగానే ఉన్నారని
అన్నానంటేమాత్రం అది
అబద్ధమే అవుతుంది.

జనాభాలెక్కలూ నాకు
సరీగా తెలియవుగాని
దరిద్రాల శాతం ఇంకా
చిరాకు కలిగిస్తూనే ఉంది.

ప్రపంచం మొత్తంమీద
భయం పెత్తనం చేస్తోంది,
ఇరుగువాడు పొరుగువాణ్ణి చూసి
ఎందుకో బెదిరిపోతున్నాడు

ఇక్కడ మా భారతవర్షంలో
ఎక్కువగా కబుర్లేగాని
సమాజ స్వరూపం మార్చే
సాహసం కనిపించకుండా వుంది.

మొన్ననే ఆంధ్రరాష్ట్రం
పుట్టినరోజు పండుగ చేసుకొంది
పన్నెండునెలల అభ్యుదయం
పర్యాలోకనం చేసుకొంది.

ఏడాదిలో ఏమవుతుంది
ఇంకా కొన్నాళ్ళాగమంది
చెల్లా చెదరైన తెలుగువారంతా
తెల్లబోయి చూశారు!

ఇవన్నీ చెప్పుకుంటూ
ఎందుకు నిన్ను విసిగించడం శశీ!
ఇప్పటికే ఆలస్యమయింది
ఇంతటితో మిరమించనా?

చంద్రునికో నూలుపోగన్న
సామెత వుండనే వుంది
తీసుకో ఈ దారంలాంటి
తేలికైని గీతాన్ని.

ఇంతకుముందే చెప్పానుగా
ఏమాటా పెగల్లేదని—
ఇలాంటివెన్నో నువ్వు
ఇదివరకు వినేవుంటావు.

శరత్కాల గగనంలో
చందమామ కనిపిస్తే
సరదాగా కొంత సేపు
సంభాషణ సాగించా.

సంతాపం కొంత సేపు
సంతోషం కొంత సేపు
సాగించిన సంభాషణలో
సారాంశం మరేముంది ?

ప్రసంగవశాత్తూ ఏ
ప్రగల్భాల పలికానో
ఆ సందర్భమైనా ఏ
అడ్డదారి తొక్కానో

వెనుక తిరిగి చూచుకొనే
అలవాటే లేదు నాకు
అరనిమిషం దాటేసరి
కదే నాకు గత శతాబ్ది.

కాపున ఓ జాబిల్లీ !
రాబోయే యుగంలో
కాలక్షేపం చేద్దాం
కలుస్తావుగా మళ్ళీ ?

అప్పుడు బహుశా నాలో
అరాజకం పోతుందనుకుంటా
ఇప్పుడు బాధిస్తూన్న
హృదయవేదన లుండవనుకుంటా

శాఖా చంక్రమణం మాని
చెప్పేదేదో సూటిగా
బల్లగుద్దిన మాదిరిగా
కుండ బద్దలుకొట్టిన బాపతుగా

ఈ నీళ్ళు నమలడం లేకుండా
ఈ కాళ్ళు తడబడడం లేకుండా
స్పష్టంగానే కాకుండా శ్రావ్యంగా
స్వచ్ఛంగానే కాకుండా సమగ్రంగా
రాబోయే యుగంలో
గుండెలు విప్పి మాటాడుకుందాం-
మినహాయింపులులేని క్షమాపణలు లేని
సౌందర్యవంతమైన ఆ స్వర్ణయుగంలో

ఎంచేతనంటే భవిష్యత్తు మీదే
ఎప్పుడూ నానిఘా వుంటుంది
ఇవాళకంటే రేపే
ఎంతో బాగుంటుందంటాను నేను.

వెళ్ళు జాబిల్లీ వెళ్ళు
కవులను కదిలించడం అంటే
కాలం దొంకంతా అమాంతంగా
కదిలించడమే అవుతుంది.

స్వయంగా నీతో మాట్లాడి
చాలా కాలమయింది
అందుకే అవ్యక్తంగా అయినా
ఆప్యాయంగా మాట్లాడుతున్నాం.

ఎలాగైనా మవ్వు మాకు
ఏకరక్త బంధువుడివి
నీతో కాకపోతే ఎవరితో
మా ఘోషలు చెప్పుకోవాలి ?

వెళ్ళు జాబిల్లీ వెళ్ళు
వినిర్మలమైన నీ వెన్నెల కురిపిస్తూ
మనోహరమైన సంగీతం వినిపిస్తూ
ప్రయాణించు శశీ ప్రయాణించు.

ఇదిగో మాట ! ఈ ప్రపంచంలో
ఇంకా ఎందరో అభాగ్యులున్నారు
పలకరించు వాళ్ళని చల్లగా
ధైర్యంచెప్పు వాళ్ళకి మెల్లిగా

ఆసుపత్రి కిటికీల్లోంచి నీ
కిరణాలను జాలుగా పంపించి
వ్యాధిగ్రస్తుల పాలిపోయిన కపోలాలను
జాలిగా స్పృశించడం మరచిపోకు

జైళ్ళలో వున్నారు కొందరు
వాళ్ళని ఓదార్పక తప్పదు సుమా
నేరాలు చేశారు నిజమే
అందుకని అలక్ష్యంగా చూడకేం !

మురికి గుడిసెల్లో నివసించే
పరమ దరిద్రుల నుదుటిమీద
ఏ కన్నంలోంచో జాగా చేసుకొని
ఎలాగైనా పరామర్శ చేస్తావుకదూ ?

ఇదిగో జాబిల్లీ నువ్వు
సముద్రంమీద సంతకంచే సేటప్పుడు
గాలిదాన్ని చెరిపెయ్యకుండా
కాలమే కాపలా కాస్తుందిలే.

# విషాదాంధ్ర

బొకాలు లాభంలేదు బొజాలు లాభంలేదు
ఎంత యీదినా ఏం ఫాయిదా ఎక్కడా తీరం కనపడదు
తలమాత్రం మీదికుంచి నిలువీత ఈదుతున్నాం
గమనం పిసరూలేదు గమ్యం అసలే లేదు

పట్టాబిరావఁ స్వామ్మీద ప్రమాణంచేసి చెబుతున్నా
అంతా గజీతగాళ్ళే మళ్ళీ అరగజం పురోగమనం లేదు
అదర్శప్రాయంగా అభినయిస్తున్నాం అయినా ఎవరూ మనల్ని
చూడ్రు
అరుస్తున్నాం గొంతుచించుకుని అయినా ఎవరూ విన్రు

మనలో కొంతమంది కవులు మధురంగా నిశ్వసిస్తారు
యతిప్రాసలు సరిపోతాయి పదాలు మజాగా పడతాయి
పౌరుషానికి లోటులేదు ప్రశస్తికికూడా డిటో
పద్యాలకి పళ్ళురాలవు చింతకాయలు చెట్టుమీదే ఉన్నాయి

ఈ గొంగళీ వయస్సు ఇరవై అయిదేళ్ళు
ఇంకా ఎక్కువే అనుకో ఎవడు చూశాడు లెక్కలు
తీర్మానాలూ ఉపవాసాలూ చేశాం ఖద్దరూ కేకలూ వేశాం
మోసుకొచ్చాం స్వరాజ్యమ్మాట మూట విప్పితే ఏమీలేదు

అరవిందఘోస్టు ఆశీర్వదించాడు కదా
ముమ్మిడివరం బాలయోగి ఏమంటాడో
ఆంజనేయదండకం వల్లిస్తేనో
అన్నట్టు సాయిబాబాకి మొక్కుకోకూడదూ

మహారణ్యంలో మధ్యాహ్నంలాగ ఒక స్తబ్ధత నిశ్శబ్ధత
రాత్రిపూట వేట ముగించుకొని క్రూరమృగాలు నిద్రిస్తున్నాయి
చిల్లరజంతువులు భయంతో ఎక్కడవక్కడ ఇరుక్కపోయాయి
ఎప్పుడేనా ఒకపక్షి ఎగిరితే ఎక్కడో ఒక ఆకురాలి చప్పుడు

శిశువుకి దక్కని స్తన్యంలాగ ప్రవహిస్తున్నాయి గోదావరి నీళ్ళు
బద్ధలైన గుండెల్లాగ బీటలు వేశాయి పొలాలు
మన పరిశ్రమలు ప్రణాళికల్లోనే మన ప్రతిభ చాకిరీకి తాకట్టు
మనకో ఇల్లంటూ లేదు రచ్చకెక్కి రాద్ధాంతాలు

కొంగల్లారా జపంచెయ్యండి పిల్లీ పఠించు మంత్రాలు
ఎలకల్లారా సభ జరపండి ఎవరు గంటకట్టాలని
ఇంకోమారు ఎగరవే నక్కా ఈసారి అందవచ్చు ద్రాక్షపళ్ళు
కోతీ తీసుకురా త్రాసు పంపకం తెగడంలేదు

# విశాలాంధ్రలో ప్రజారాజ్యం

శక్తికోసమే నడు :
ముక్తికోసమే మను : విముక్తికోసమే మను :
విశ్వశాంతి క్రాంతికోసమే మనస్సు లేకమై,
నడూ నడూ : భయం గియం విడూ :

వేగుజుక్క వెలిగె మింటిపై
వెలుగురేఖ లవిగో కంటివా :
ఉదయ మెంతొలేదు దూరము
వదలిపోవు నంధకారము

జీవితాశలే
భావి జాడలోయ్
ప్రపంచజాతి శాంతి కాంతి బాటసారివై ॥నడూ నడూ॥

విరోధించువారు లేరులే
నిరోధించువారు రారులే
అస్తి నాస్తి భేదమేలరా :
వాస్తవం వరించి సాగరా :

విశాలాంధ్రలో
ప్రజారాజ్యమే
ఘటించగా శ్రమించరా పరాక్రమించరా :

॥నడూ నడూ॥

# మున్నుడి

చెవులు విప్పి మనసు విప్పి
కనులు విచ్చి వినవయ్యా
కేథలిక్కు కెన్నెడీ
బోల్షివిక్కు మున్నుడి

అరుపులిచ్చి కరువు తెచ్చి
ఋణం పెట్టి రణం తెచ్చి
జనం ధనం ఇంధనమై
చరణ కరాబంధనమై
జనన జరా మరణ దురా
క్రమణల సంగ్రంథనమై

ఒకనా డోహూ అని పిం
చుక తిరిగిన ధనిక వాద
మికపై వెగటై జిగటై
మరణంలో మశౌతుంది

వినవయ్యా కెన్నెడీ
విశాలాంధ్ర మున్నుడి

*  *  *

కేథలిక్కు కెన్నెడీ
జీవితమే నిన్నది

భావనలే మొన్నవి
క్యూబా ఏమన్నది
లావోస్ ఏమన్నది
కాంగో నిలిచున్నది

ఐసన్‌హోవర్ చేసిన
మోసం తాలూకు అసలు
వేసం ఈనాడు పైకి

ఎగిరివచ్చి నిజం పైకి
లెక్కా వచ్చి జనం తిరుగు
బాటుచేసి ఆకలేసి
పిడికెడు కబళం కావా
లని యడిగిన తరుణంలో
లుముంబాను తిన్నావు
కటుంబాలు కొన్నావు

అమెరికాల కాలు విరిగె
ఆఫ్రికాకు నోరు తిరిగె
ఆసియాకు ఆశరగిలె
ఆస్ట్రో ఆఫ్రో ఏషన్
కాస్ట్రోలకు కనులు విరిసె

ఏమంటావ్ కెన్నెడీ
ఈ శ్రీ శ్రీ సన్నిధి

చంపేస్తానని నీకో
సందేహం ఉండవచ్చు
సర్దేస్తానని నీకో
సమాధాన ముండవచ్చు

నీటాంకులు నీ బాంబులు
విమానాలూ విధానాలు
శ్మశానాలు చూస్తాయి
ప్రశాంతినే హరిస్తాయి

నీ సలహాదారులతో
నీ కలహాచారులతో

పెంటగనుల తుంటరులను
పెంటబెట్టుకొని వస్తే

రాకెట్లను విసరుతాం
నీ కట్లను విప్పుతాం

జాకెట్లను సవరించి
పాకెట్లను సరిదిద్ది

నీ మతాన్ని నీ హితాన్ని
నీ గతాన్ని కెలుకుతాం
చీకట్లను తరుముతాం

నీ హిట్లరు పాతదనం
చావాలని కసరుతాం

విన్నావా కెన్నెడీ
శ్రీ శ్రీ శ్రీ మున్నుడి

# సదసత్సంశయం

ఆలోలము లాలోచన
లేవేవో నాలోపల
ప్రాలేయచ్ఛాయలవలె
తారాడగ కోరాడగ

పేరుపేరు వరసలతో
పిలిచి ప్రశ్న వేస్తున్నా
ఈ తెగని సమస్యను భే
దించువారలెవరో అని

ఎన్నో సందేహాలూ
ఎన్నో సంపాతాలూ
జీవితంపు చిక్కు ముడులు
విడ వెంతగ సడలించిన

ఈ సృష్టికి ఏమర్థం
మానవునికి గమ్యమేది
ఒక సకలాతీత శక్తి
ఉన్నట్టా లేనట్టా

౨

నిరంతరం ఘోషించే
నీరనిధిని పిలిచినాను
ఆస్తి నాస్తి రూపమైన
ఆకాశము నడిగినాను

మహాకవుల గ్రంథాలను
మనసు పెట్టి పఠించాను
ప్రవ్రజితుల ముముక్షువుల
భావాలను స్మరించాను

యుగయుగాలు తరలెగాని
ప్రశ్న ప్రశ్నలాగున్నది
అలలు కదిసి మురలి చనగ
శిలమాత్రం మిగిలినట్టు

జగదీశ్వరు డతడెవరో
అగపడితే బాగుండును
ఏమీ యిది స్వామీ అని
నిలవేస్తా కడిగేస్తా

౩

కవిహృదయపు కనుమలలో
గర్జించిన పర్జన్యం
పెనుచీకటి తిరుగుబాటు
బీభత్సపు మెరుపుదాడి

కనులముందు చిత్రించే
గతిలేని జనాల బాధ
కడుపు తరుక్కునిపోయే
కన్నీళ్ళ విషాదగాథ

కరువులలో వరదలలో
కటికదరిద్రుల అవస్థ
కవితలోన కథలలోన
కట్టాలని తలచినపుడు

ఈ విశాల జగతినుంచి
ఏమిటి నే కోరినాను
ఒక జానెడు సానుభూతి
ఒక దోనెడు తీరుబాటు

జ్ఞానులు బోధిస్తూ బ్ర
హ్మానంద మవాజ్మానస
విశదమనీ అనుభవైక
వేద్యమనీ నుడివినారు

జపంవల్ల తపంవల్ల
ప్రపంచాన్ని మరిచిపోయి
భగవంతుని ధ్యానంలో
పడిపొమ్మని పలికినారు

మంచి చెడ్డలను కొలిచే
మానదండమట దైవం
ఈశ్వరు డొకడే సత్యం
ఇతర సమస్తం మిథ్యట

ఇంద్రియాలద్వారా మన
కీ సత్యం తెలియదంట
విశ్వాసం తప్ప మనకి
వేరే సాక్ష్యం లేదట

×

అగుపించనిదేదో ఒక
ఆత్మ పదార్థం కలదట
అన్నీ పోవచ్చుగాని
అదిమాత్రం చావదంట

నిప్పు దాన్ని కాల్చలేదు
ఛిందించగలేదు కత్తి
నీరు దాన్ని ముంచలేదు
గాలి దాన్ని చెనకదంట

జన్మలనీ కర్మమనీ
చాలాదూరం పెళ్ళిన
ఆలోచనలన్నీ ఈ
ఆత్మచుట్టు అల్లినవే

ఏతదాత్మ సర్వేషాం
సర్వత్రా ఆవరించి
సర్వస్వం తానే ఐ
శాసిస్తుందంట జగతి

౬

పుణ్యాపాప నిర్ణేతలు
నిత్యవినీతిజ్ఞ విజ్ఞు
లస్తి నాస్తి విచికిత్సకు
లంతమంది యేమన్నా

ఇదిమాత్రం నే నెరుగుదు
నెంతమంది యేమన్నా
తథ్యం ప్రాణికి మృత్యువు
తప్పదు జీవికి వేదన

జడిగొల్పే దుఃఖంలో
తడియకుండ గొడుగులేదు
ఆనందాలన్ని తుద
కంతమొందు నొక సమాధి

మనుజునిలో మరణ భీతి
మదిలో దుఃఖానుభూతి
ఆలోచనలన్నిటికీ
ఆంతర్యంలో పునాది

౭

ఎవరయ్యా ఎవరువారు
ఈశ్వర పద జిజ్ఞాసువు
లెవరయ్యా ఎవరంటా
ఇదివరలో ఎవరువారు ?

ఉద్యోగపు ధర్మంలో
పద్యాంహశ్చర్యంలో
విటతాటపు బ్రతుకు గడిపి
రిటైరైన పోలీసులు.

నిత్య నిధువనక్రీడా
నృత్యంలో అలిసి పోయి
జవసత్వా లుడిగిపోయి
సాధుపైన వేశ్యామణి

నైకానోకహ విహారి
కాకంవలె దుఃఖ రాత్ర
ఘూకంవలె సంచరించు
లోక ద్వేషాగ్ని శిఖ.

౮

ఇంకా చెప్పాలంటే
ఎందరో :మహానుభవులు
బ్రతుకునించి పారిపోయి
తమ వెనుకనె దాగువారు.

పురణ పురుషోపపుష్పాన
జీవిత మొక ద్వీపంలా
తమపాలిటి శాపంలా
తలపోసే ఫిలోఫస్లు

ఆహా మరి యింతేనా
అందమైన మన మనుగడ
మూడు నాళ్ళ వింతేనా
జగమతుకుల బొంతేనా

మెదడన్నది మనకున్నది
అది సరిగా పనిచేస్తే
విశ్వరహఃపేటికా వి
పాటన జరగక తప్పదు.

౯

"పరివఱ్ఱ్యామి గీతార్థే
న" యన్నాడు కాళిదాసు
బహుశా అంతకుమించిన
* క్థోనిజమే ఉండదేమొ

ఔను - అహింసను పోలిన
పరమో ధర్మమ్ము లేదు
(పరమో ధర్మం విరువకు
పరమ - అధర్మం అంటూ)

---

* chthonism–Humanism

ఈవిల్, సిన్ మొదలైన ప
దాలను వాడే టప్పుడు
న్యాయం ధర్మం నీతీ
త్యాదుల చర్చించేప్పుడు

ఎవరికి తోచిన అర్థం
వారలు చెప్పక తప్పదు
పరమార్థం సామాజిక
సామూహిక సద్వర్తన

# మహా సంకల్పం

ఇది నా స్వాతంత్ర్యదిన
మహా సంకల్పం.
విధిగా వికసించే
చరిత్రకొక కృతజ్ఞత.
ప్రజలకు నివాళి.
ప్రభవించిన నూతన భారత
పతాక కభివాదం.
భవిష్య దుజ్జ్వల
భర్మయుగానికి ఆహ్వానం.
పరిహద్దు లెరుంగని
పకల జగజ్జనులారా
ఇదిగో నా స్వాతంత్ర్యస్వప్నం!

ఏ స్వాతంత్ర్యం నిమిత్తం ఎవరెవరెవరో ఎందరో దేశసేవా
భాస్వంతుల్ బాలవృద్ధుల్ పతితు లధిక లప్రాజ్ఞులుత్ప్రజ్ఞులంతా
అస్వాశల్‌పీడి లాతీహతులయి ఉరికొయ్యల్ కవుంగింటచేర్చా
ర స్వాతంత్ర్యం లభించిందనివినిహృదయం హ్లాదసంపుష్టమైతే

నవోదిత స్వాధీనతానంది తోత్ఫుల్లమైన
నగరం జెండాల పంటలతో నవ్వుతూ పాడుతూఉంటే
ఉత్సాహ ప్రవాహంలో నేనూ ఒక బిందువునై
స్వాతంత్ర్య వాయువులు పీలుస్తూ సాగిపోయా

ఆ సమయంలో అందరి మనస్సు
లావరించె నొకవ్యక్తి
అందరిలోనూ ఆ సమయంలో
ఆవహించె నొక శక్తి
అంతట్లోకే అకస్మాత్తుగా
జన సందోహం కరిగి
ఒకే వ్యక్తిగా రూపుదరిస్తే
ఇదేం చిత్రమని చూశాను.

ఒక పెద్ద కాంస్య విగ్రహా
నికి ప్రాణం వచ్చినట్లుగా,
ఒక మేఘం గగన పథం దిగి
మానవుడై నిలిచి నట్లుగా,
ఒక మహా వట వృక్షం
హఠాత్తుగా నడిచినట్లుగా,
ఒకేఒక్క మానవమూర్తి
నా కళ్ళముందు కనిపించాడు
ఎం చేతో అతని ముఖం మీద
ఎప్పుడూ ఉండే పసిపాప నవ్వులేదు ;

ఆ మానవానసంలో
ఏదో కించిద్విషాదం. కించిన్నిరాశ
కొంచెం విరాగం. కించి దసంతృప్తి.
ఆ మానవ వదనం అందరికీ పరిచితమే.
అతడే నువ్వూనేనూ.అంతమంది వెరసి.

స్వతంత్ర భరతవర్ష వాస్తవ్య డా మానవుడు
అర్ధనగ్నంగా ఆకాశాన్నే కప్పుకొని
నిండని కడుపుతో మండుతూన్న కళ్ళతో
ఇలా ఎంతకాలం ఇంకా నిలబడతా డా ప్రాణి?

అతణ్ణి జాగ్రత్తగా చూడండి
స్వతంత్ర భారత పౌరుడు,
అతని బాధ్యత వహిస్తామని
అందరూ హామీ ఇవ్వండి,
అతని యోగ క్షేమాలకు
అంతా పూచీ పడండి,
అతికించండి మళ్ళీ
అతని ముఖానికి నవ్వు !

స్వాతంత్ర్యం ఒక బాలా సున్నితమైన పువ్వు,
బాలా వాడైన కత్తి, విలువైన వజ్రం
స్వాతంత్ర్యం తెచ్చే వెన్నెనో్న బాధ్యతలు
సామర్థ్యంతో నిర్వహిస్తామని
సంకల్పం చెప్పుకుందాం !

భగవంతుని ప్రార్థించిందికి
బహుశా ఇది సమయం కాదు,
పాతవి గుంజాళించిందికి
బహుశా ఇది సమయం కాదు,

ఇది మన కొక దీక్షాసమయం
ఇది మనకి పరీక్షాసమయం
ఆవేశం ప్రకటించిందికి
అసలే ఇది తరుణం కాదు—

రా : నేస్తం, పోదాం : చూదాం
మువ్వన్నెల జెండా వండుగ;
రా : నేస్తం, లేదాం : చూదాం:
మన భారతజన సౌభాగ్యం,

అటు చూడు సముద్రం, నేస్తం,
హర్షానికి పర్యాయపదం;
ఇటు చూడు విహాయసనేత్రం
దుఃఖానికి అధ్యాహారం :
ఈ రెండిటి మధ్య నిల్చి
నీ లోపల లోలో పలికే
ఆలాపన లాలోకిస్తే
వినపడదా ఒక సంగీతం,
విడివడదా ఒక సందేశం :

ఇదీ నా స్వాతంత్ర్యదిన
మహా సంకల్పం,
ఇది నా ప్రజలకు నివాళి
స్వతంత్ర భారత పతాకాని

కిది నా అభివాదం.

భవిష్య దుజ్జ్వల

భర్మయుగానికి ఆహ్వానం.

సరిహద్దులు లేని

సకల జగజ్జనులారా !

మనుష్యుడే నా సంగీతం.

మానవుడే నా సందేశం !

# 'కోఈ హాస్ రహా హై'

# 'కోఈ రో రహా హై'

ఒక మనిషి బ్రిడ్జిమీద నడుస్తూ జేబులోని చిల్లర డబ్బులు బిచ్చగాడి కిచ్చేస్తాడు; రిస్టువాచీని ఎదురుగుండా వస్తూన్న నున్ను కిచ్చేస్తాడు; కోటుతీసి నీళ్ళలో పడవేస్తాడు; దాని వెనుకనే నీళ్ళలో పడిపోతాడు.

ఒక మనిషి వ్యాపారం పారం కనుక్కుంటాడు; వాడి చేతుల్లో రూపాయల చెట్లు మొలుస్తాయి, అవి బ్యాంకుల్లో బంగారపు గుడ్లు పెడతాయి; వాటిలోంచి కన్నీరు సొనగా కారుతుంది.

ఒక మనిషి మైలురాయిదగ్గర మౌనంగా కూర్చుంటాడు; అనుక్షణంఎవరో వస్తూన్నట్లు నిరీక్షిస్తాడు; బస్సులు లెక్కపెడుతూ బటానీగింజలు తింటూవుంటాడు; మేఘాన్ని చూస్తూ కాలాన్ని మరిచిపోతాడు.

ఒక మనిషి నిచ్చెనలు మోసుకుంటూ తిరుగుతాడు – సంచీలో బాతుగుడ్లూ వాడూను ; గోడకినిచ్చెన చేరవేస్తాడు; నిచ్చెన ఎక్కి బాతుగుడ్డు ఆకాశంమీదకి విసురుతాడు; అంతఎత్తు బంగారానికి హరిశ్చంద్రుణ్ణి కొనుక్కున్న ఆసామీవీడే.

ఒక మనిషి రంధ్రాల్ని అన్వేషిస్తాడు; వాటి సైజుల్లో భేదం వుంటుంది.

ఒక మనిషి అరాజకాన్ని అమ్మ జూపుతాడు; దీర్ఘబాహువుల్తో దేన్నో దేవుతున్నట్టే వుంటాడు; యువకుల హృదయ రక్తకాసారాల్లో దొరికే గజనిమ్మ పళ్లు తప్ప మరేవీ తినడు; అప్పైనా రోజుకి ఒకసారి మాత్రం,

ఒక మనిషి కాంభోజిరాగం పాడుతూ కాలాన్ని వెళ్ళపుచ్చుకుంటాడు; వాడిదగ్గర ఒక విపంచికూడా ఉందన్నసంగతి ఇక్కడ జ్ఞాపకం చెయ్యకపోవడం అనవసరం; ఆవేళల్లో ఆలాపించే రాగాల్ని శాసించడానికే ఆవేళ్లు; వాటి స్పర్శకి నక్షత్రాలు అంటుకుంటాయి; చంద్రుడిలో సరస్సులు సలసల కాగుతాయి; నా గుండెల్లో చలికాలం చివురు తొడిగి సీతాకోక చిలకతో పెళ్ళి మాటలు ప్రారంభిస్తుంది.

ఒక మనిషి కర్పూరం కళ్ళకీ, సిందూరం చెక్కులకీ రాసుకుంటాడు; పూసుకుంటాడు; వాడొక కవి, రహస్యభాషలో అందుకున్న సందేశాలని వ్యాఖ్యానం చేస్తూ విమానశాఖలో పనిచేస్తాడు; బజారు ధరలు పడిపోతూండడానికి వాడే గొప్పకారణం.

ఒక మనిషి రుద్రాక్ష తావళాలు మెడలో వేసుకుని జపంచేస్తూ వుంటాడు; బొజ్జతో ఆలోచిస్తాడు; వాడిముందు కొబ్బరికాయలు కొట్టొద్దు మొర్రో అని నేను మొత్తుకోవడంవల్ల ప్రయోజనం లేదని తెలిస్తే మాత్రం ప్రయోజనమేమిటి ?

ఒక మనిషి ఒక్కత్తెనే ప్రేమిస్తాడు; ఆమె చచ్చిపోతుంది; తరువాత కథ తెరమీద చూడండి.

ఒక మనిషిని ఉరితీసేస్తారు; వాడి చావుతో శాంతిని కొనుక్కుంటుంది సంఘం; న్యాయశాస్త్రం తృప్తిగా నిట్టూరుస్తుంది; వాడి నెత్తురు చిందినచోట ప్రతి సాయంత్రం వొక కన్నులేని కుక్కపిల్ల జాలిగా మొరుగుతుంది; తన్ను అన్యాయంగా ఉరితీశారని చెప్పడాని కిష్టంలేనంత గర్వం ఆమానవుడికి.

ఒక మనిషి ఉపన్యాసాలిచ్చి గొప్పవాడవుతాడు; ఒక మనిషిచిత్తుగాతాగేసి బీదవాడవుతాడు; ఒకడు దొడ్డమ్మ దగ్గర కానీ తీసుకుని గాలిపడగ కొనుక్కుంటాడు; ఇంకొకడు దాన్ని లాక్కుంటాడు.

ఒక మనిషి పరారీ అయిపోతాడు; వొకడు పూనాకి పోతాడు: వొకడు పెళ్లాడేస్తాడు: ఒకడు పడుక్కుంటాడు; మరొకడు కునికిపాట్లు పడతాడు; ఇంకొకడు బాతాఖానీ కొడతాడు; ఒకడి ఏడుపుకి నవ్వొస్తుంది; ఒకడి నవ్వు ఏడుపు తెప్పిస్తుంది; ఉదాహరణలతో సహా ఇది నేను బుజువు చెయ్యగలను.

అండజ భీము డండడడ డండడ డండడ డండ డండ డండండడ డండ డండ డడ డండడ డండడ డండ డండ....స్వామీ ! దీని కంతమెప్పుడు !

శిష్యా ! ఇది అనంతం.

# గాంధీజీ!

మరచిపోయిన సామ్రాజ్యాలకు
చిరిగిపోయిన జెండా చిహ్నం
మాయమైన మహాసముద్రాలను
మరుభూమిలోని అడుగుజాడ స్మరిస్తుంది

శిథిలమైన నగరాన్ని సూచిస్తుంది
శిలాశాసనం మౌనంగా
ఇంద్రధనుస్సు పీల్చే ఇవాళటి మనస్తేత్రం
సాంద్రతమస్సు చీల్చే రేపటి మిణుగురు పురుగు

కర్పూర ధూమధూపంలాంటి
కాలం కాలుతూనే వుంటుంది
ఎక్కడో ఎవ్వడో పాడినపాట
ఎప్పుడో ఎందుకో నవ్వేపాప

బాంబులవర్షాలు వెలిసిపోయాక
బాకుల నాట్యాలు అలిసిపోయాక
గడ్డిపువ్వులు హేళనగా నవ్వుతాయి.
గాలి జాలిగా నిశ్వసిస్తుంది.

ఖడ్గాన్ని రద్దుచేస్తుంది ఖడ్గం
సైన్యాన్ని తినేస్తుంది సైన్యం
పొలంలో హలంతో రైతు
నిలుస్తా డివాళా రేపూ

ప్రపంచాన్ని పీడించిన పాడుకలని
ప్రభాత నీరజాతంలో పెదకు
ఉత్పాతం వెనుకంజ వేసింది
ఉత్సాహం ఉత్సవం నేడు

అవనీమాత పూర్ణగర్భంలా
ఆసియాఖండం ఉప్పొంగింది
నవప్రపంచ యోనిద్వారం
భారతం మేలుకుంటోంది

నేస్తం మనసుఖాలకి వాయిదా వేద్దాం
అసౌకర్యాలు మూటకట్టి అవతల పారేద్దాం
ఇంకోమాటు వాగ్వాదం ఇంకోనాడు కొట్లాట
ఇవాళ మాత్రం ఆహ్లాదం ఇవాళ తురుపాసు

# మంచి ముత్యాలసరాలు

ఎర్రశాలువ కప్పుకొని మా
ఇంటి కొచ్చిందొక రివాల్వర్
బాధలో బెంజైన్ సీసా
ప్రేములో డైమాన్ రాణీ.

మెడకి కాంచనమాల చక్కని
జడకి చుట్టిన పుష్పవల్లి
చావుబతుకుల జమిలిదుప్పటి
కప్పు కొచ్చింది.

ప్రేమగానం మోసుకుంటూ
మహోశంఖం మాటలాడదు
ఐంద్రకార్ముక మంత్ర బర్హం
మబ్బుచాటున మాయమైనది.

పాతపీపా పీకపాపా
పాడుకుంటూ తిరుగుతాయట
కొత్త గొంతుక చెవిని పడితే
గుడ్లు నిప్పులు చెరుగుతాయట.

నేను వెళ్ళిన నాటినించీ
సీడలోపలి మేడ దిగదట.
కోడిగుడ్డు ప్రమాణకంగా
కృష్ణశాస్త్రిని చదవలేదట.

నన్ను తిట్టిన తిట్లతోనే
మల్లెపూవుల మాల కట్టెను
నాకు వ్రాసిన ప్రేమలేఖలు
పోస్టుచేయుట మానివేసెను.

వెయ్యిరాచ్చిప్పలని మేసిన
వెర్రికుక్కకి గాలివాన
రోలు చెప్పిన కథకి పాపం
డోలు కంచికి పైనపైనది.

ఓరి కూపస్థ భల్లూకం
గోడపై రుద్రాక్షపిల్లీ
ఆటలోపల అరిటిపండూ
పాట లెందుకురా.

ఎగురుతున్నాయ్ ఇనపకోటలు
పగులుతున్నాయ్ పాతపాటలు
రగులుతున్నాయ్ రాచబాటలు
రాజుకోవేరా.

ప్రేమకీ సంఘానికీ ఒక
జారుముడితో చాలు పోరా
నిన్ను తిట్టేవాళ్ళకోసం
కళ్లు విప్పుకు నిద్రపోరా.

ఇదే నాకడసారి సలహా
ఇలా తే నీమనీపర్సని
ఆంధ్రపత్రిక కప్పుకొని కా
రడవి కేగిం దా రివాల్వర్.

నేడు నా కంట్లో సివంగులె
నిద్రలో నిలిచే ఫిరంగులు
కాళ్లచుట్టూ కపాలాలే
కావ్యగీతీ కలాపాలు.

# ఏవి తల్లీ!

## (THESNOWS OF YESTERYEAR)

[F. Villon అనుసరణము]

చక్రవర్తి అశోకుడెచ్చట ?
జగద్గురు శంకరుండెచ్చట ?
ఏవి తల్లీ ! నిరుడు కురిసిన
హిమ సమూహములు ?

కాళిదాస మహాకవీంద్రుని
కవనవాహినిలో కరంగిన
ఉజ్జయిని నేడెక్కడమ్మా
ఉంది ? చూపించు !

షాజహాన్ అంతఃపురంలో
షట్పదీ శింజాన మెక్కడ ?
ఝాన్సి లక్ష్మీదేవి యెక్కిన
సైంధవం నేడేది తల్లీ ?

రుద్రమాంబా భద్రకాళీ
లోచనోజ్జ్వల రోచులేవీ ?
ఖడ్గతిక్కన కదనకాహళ
కహకహధ్వను లెక్కడమ్మా ?

ఎక్కడమ్మా కృష్ణరాయని
బాహుజాగ్ర ద్బాడబాగ్నులు ?
బాలచంద్రుని, బ్రహ్మనాయని
ప్రాణవాయువు లేవి తల్లీ ?

జగద్గురుపులు, చక్రవర్తులు,
సత్కవీశులు, సైన్యనాథులు,
మానవతులను మహారాజ్ఞులు
కానరారేమీ ?

పసిడిరెక్కలు విసిరి కాలం
పారిపోయిన జాడలేవీ ?
ఏవితల్లీ ! నిరుడు కురిసిన
హిమ సమూహములు ?

# సామాన్యుని కావున

## ౧. సామాన్యుని వాస్తవికత

ఈరోజున సామాన్యుడు
ఏమీ లేనట్టివాడు
కూడూ గూడూ గుడ్డా
ఏవీ లేనట్టివాడు
చదువూ సామూ శాస్త్రం
ఏవీ యెరగని వాడు

ఈరోజున సామాన్యుడు
సగం దేవతాంశ సగం
రాక్షసాంశ, సగటున ఈ
సామాన్యుడు మానవుడు

అంటే నీవూ నేనూ
ఆమె ఈమె వీడు వాడు
అంతా సామాన్యులమే
సగం వెలుగు సగం నీడ

సగం బ్రుతం సగ మన్మతం
సగం ఆడ సగం ఈడ
సగం పశువు సగం నిసువు
ఈ వెల్తురు ఈ చీకటి

ఈ యిరులూ ఈ వెలుగూ
వేరువేరు గదులు కావు
ఒకటీ రెండూ కూడా
ఇపుడు నిప్పు ఇపుడె పువ్వు

ఇప్పుడు దూసిన ఖడ్గం
ఇంతట్లో కౌగిలింత
ఒక నేత్రం కల్హారం
మరోకన్ను కర్పూరం

మూడో కంటి వాడంటూ
లేడంటే నమ్మకతప్
చూడవోయ్ నీలోకి నీవు
ఒకటి రెండు వెరసి మూడు

నరకం స్వర్గం అన్నవి
ఒక స్థితికే రెండు పేర్లు
భోకస్ భేదం అంతే
లోకస్ రెండిటి కొకటే

శ్రీ అనగా లక్ష్మి, సరే
శ్రీ అంటే విషం కూడా
శ్రీ శ్రీ సిరి చేదు. లేక
సిరీ సిరీ, చేదు చేదు

మీ యిష్టం శ్రీకారం
గుణకారం చేసుకోండి
మీకే అర్థం తోస్తే
ఆ key నే వాడుకోండి

ఒకటే శ్రీ అదే రెండు
అదే చేదు సిరీ అదే
అమరత్వం అసురత్వం
శ్రీ శ్రీ ఒక మానవుడు

౨. నేపథ్యంలో :

నీ మూసిన పిడికిటిలో
ఏమున్నది కవీ కవీ
ఆదాచిన పళ్లెంలో
ఏం తెచ్చావ్ సుకవి

ఆ మూలని సంచీలో
ఏమున్నది కవీకవీ
నీమూసిన గుండెల్లో
ఏం దాచావ్ సుకవీ

నీ పాడని పాటలలో
రాపాడే దేదికవీ
ఆ కొనలో నీడలలో
ఏసత్యం సుకవీ

ఏసత్యం ఏస్వప్నం
ఏస్వర్గం సుకవీ
మాకోసం నీకోసిన
వే కొన్కల పూలు కవీ

౩. సామాన్యుని కామన :

నైస్సువల్ల ఈ రోజున
సామాన్యుని బతుకుకూడ
సౌందర్యమయం కాగల
సదుపాయం లభించింది

జన్మం చర్మం వెనకటి
సంప్రదాయమూ ఇప్పటి
సంఘస్థితులూ నెరపే
అసమానత పనికిరాదు

ఐశ్వర్యం అందరిదీ
అందుచేత అందులోన
సామాన్యుడు తన వాటా
తనకిమ్మని కోరుతాడు

బతకడమే సమస్యగా
పరిణమింప జేసినట్టి
అన్యాయాలన్నిటినీ
హతమార్చాలంటాడు,

ఇదేం పెద్ద గగనమా ? మ
రిదేం గొప్ప కోరికా ? ఇ
కేం? ఇదొక్క విప్లవమా ?
ప్రశ్నిస్తే పాపమా ?

యుగసంధిది. సామాన్యుని
శకం దీన్ని కాదనరా
దిది రేపొచ్చే వ్యవస్థ
కివాళనించీ పునాది
ఇప్పటినించీ నాంది

అంతే, ఇంతే స్వప్నం !
అన్నీ ఒక్కడికి బదులు
అంతమందికి అన్నీ !
అదే స్వర్గమంటాను

ఆ స్వర్గం వేరే కడు
దూరంలో లేదు లేదు
ఈడే నేడే వున్నది,
నీలో నాలో వున్నది.

మీ యిష్టం ఈ ధాత్రిని
చేయవచ్చు స్వర్గంగా
చీల్చవచ్చు నరకంగా
ఏంచేస్తారో సరిపుచ్చి యిక మీయిష్టం.

తాత్తా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ.
Cell : 9441518715

# రు బా యు త్

Charlie Chaplin, Joseph Stalin

Walt Disney, Georges Hungnet

Greta Garbo, Pirandello

ఇటీవల మా inspiration.

Sigmund Freud, Harold Lloyd

Albert Einstein, Jacob Epstein

హరీన్ చట్టో, గిరాం మూర్తీ,

ఇటీవల మా inspiration.

కథాకాలీ, కూచిపూడీ

జావా నాట్యం, Russian Ballet,

Jazz, Rumba, Carioca

హుషారిస్తాయ్, నిషాచేస్తాయ్.

Don Bradman, Mohan bagan

Walter Lindrum, Vines, Cochet

కొంచం carroms, కాస్త ping-pong

ఒక cup కాఫీ, ఒక పఫ్ cigarette

తమాంషుడ్.

# భ్రమరగీత

[శాంతిలో అశాంతి ఆశాంతిలోనే శాంతి అనుభవించగలవాడు శ్రీశ్రీ]

గిరగిరగిరాం

భ్రమరం

గిరాం భ్రమణం

భ్రమం

'భ్రమరణం'

భ్రమణ భ్రమరం

భ్రమర భ్రమణం

గిరగిర గిరాగిరా గిరాం భ్రమణం

రణం

మరణం

రణమరణం దారుణహననం

ధిషణానిధనం

వృధామథనం

అది నాచెవిలో కథనం

లోకధనం

కదనం

కదన కథాకథనం

అది నా యెదలో రణనం

ఝణఝణ ఝంఝణ ఝణాఝణా నిక్వణనం

అది నానయనంలో ప్రథమారుణకిరణం

రణ నిస్సహాణం

వధా విధా నాచరణం

నాలో లోలోపల భ్రమా భ్రమర సంచరణం

రణద్రణ నిస్సహాణ ప్రణవం

అది నా హృదయింలో రుధిరజ్వలనం గీతాజననం॥

# బొమ్మలాంతరు

దిద్దుతూన్న గుంట ఓనమాలు చెరిపేసి
చేతిలో ఉన్న బలపం విరిచేసి
కొత్తపలక కొనుక్కొచ్చాడు కుర్రాడు

పాగాచుట్టుకొంటూన్న రోకలి పారేసి
తెలివితక్కువతనాన్ని గొయ్యితీసి పాతేసి
పొరుగువాడెలా ఉన్నాడని భోగట్టాచేశాడు పెద్రాడు

ఆడుతూన్న నాటకం ఆపేసి
పెట్టుకున్నగడ్డం కుళ్ళాయీ లాగేసి
ఆడియస్సులో కలిసిపోయాడు విదూషకుడు

నిన్నటి వాగ్దానాన్ని నేటి ఉపన్యాసంలో కాల్చేసి
నేటి ఘోర్జరీని రేపటి సంతకంగా మార్చేసి
ఇక్కడేవుండు వొస్తానని ఎక్కడికోపోయాడు వినాయకుడు.

తనచుట్టూ తాను తిరుగుతూ
సూర్యుడిచుట్టూ పరిభ్రమించే భూమిలాగ
ఆశయంచుట్టూ తిరుగుతోంది ఆవేశం.

(చీట్లాటలో ఒక చేతిని అన్నీ పొడిముక్కలే అయి ఒక్క బొమ్మా లేకపోవడం బొమ్మలాంతరు. అప్పుడు ఆట కలిపి మళ్ళీ ముక్కలు కలపడం ధర్మం.)

# ఆ ఖ రి మా ట మొ ద టి మా ట !

ఆఖరిమాట మొదటిమాట
ఆశలకేం అనంతం
ఆకాశం నాగుడారం
అ ఆలు నా ఆస్తి
ఆసియా అంతవాణ్ణి
ఆశలకేం అనంతం
అప్పారావు నా నేస్తం
ఆంధ్రత్వం నా శాపం
విశాఖపట్టణం వూరు
పెర్రాసుపత్రి పేరు
ఆఖరిమాట మొదటిమాట
ఆశలకేం అనంతం
ఆసియా అంతవాణ్ణి
ఆశలకేం అనంతం

అమాంతంగానే కాదండయ్యా క్రమంగా క్రక్రమంగా నా
సమస్తం మీ సమక్షంలో సమర్పిస్తా శమిస్తే
కపాలం నవ్వితేనేం కంపింపింబింబింపిస్తా[1] నీ
ప్రపంచాన్నే పాటల్లో ఆటల్లో నా మాటల్లో

ఇదే నా రహస్యం
యథార్థం నా తురుపు [2]

నాకేమున్నాయిలే ఆసులా రాజులా రాణీలా
జాకీలా క్షణకాలం జెండా ఎగిరించేస్తాం
ఆ కొంచెం చాలదంటే సైనైడ్‌కూడా కొంచెమే కా
దా కాదంటే కాదనండయ్యా అన్నయ్యలారా

పరమాణువు నా ప్రపంచం[3]
నాతో నా గుణకారం

క్షణాన్నే సాగదీస్తే కాలం దొంకంతా కదల్దా
ఇలాగే ఎక్కేద్దాం శిఖరం కొత్తరాస్తాలు తీస్తూ
మిలిట్రీలారీ నడిపించే పద్ధతిలో పద్‌హతితోనే
అణాలూ అరణ్యాలూ అణువులూ అద్రులూ దాటుకుంటూ

ఆవేగం నా వేగం
ఆసియాలకేం అనల్పం

వికృత్వం ఋంతాయమానంగా[4] కనబడితేనేం
ఒకానొక ఋజుత్వం సాధిస్తాం మనం లోపా
యికారీవ్యాపారాల్లో పాల్గొంటామా చేస్తే
అకస్మాత్తుగా ఓపెన్‌గా చేస్తాం లేకపోతే నిద్రపోతాం

స్వప్నంలో స్వర్గం[5]
హతాశయాలకి పొటాసియాలు[6]

హిప్పోపొటామస్ హిట్లర్‌హిండెన్‌బర్గ్ హిడింబా
హిరణ్యాక్షరాజ్యాలూ ఇవన్నీ ఎందుకోయ్ ఫ్రీ ఫ్రీ
ఫ్రీతోఫ్రీ[7] ఫ్రీఫ్రీతోఫ్రీఫ్రీ ఫ్రీఫ్రీఫ్రీతో ఫ్రీఫ్రీఫ్రీ
శిఖరంపై జెండా శిలలకిప్రాణం చీనీతో చీనాతో[8] స్నేహం

ఆఖరిమాట మొదటి మాట[9]
ఆశలకేం అనంతం[10]
అప్పారావు నా నేస్తేం[11]
ఆంధ్రత్వం నాశాపం[12]
ఆశయం అంతవాగ్ణి[13]
ఆశలకేం అనంతం
ఆఖరిమాట మొదటిమాట
ఆశలకేం అనంతం
అప్పారావంత వాగ్ణి[14]
ఆశలకేం అనంతం

---

Notes

Manifesto = Automatic writing + Psychomontage

1. Double verb telescopy
2. Aspects of Reality as laboratory data
3. Micromacrocosmology
4. Grammarian's funeral
5. Oneiric dominion status
6. "Suicide is no solution"
7. Binary fission
8. Heterosex...
9. Hysteron Proteron
10. Novelway, swansway
11. Camaraderie
12. Defeatism
13. Idealism
14. Megalomania

# DECOMPOSITIONS

౧

తురాయికంపె, ఆ
కు రాయికంపె, కీ
చు రాయికంపె - హిమాం
ళు రాయి గొప్పవాడు.

౨

బుజంగప్రయాతం, బుభుక్షితభూతం
చలంగారి పాపం, ప్రజా మిత్రకోపం
జరుక్ నాధ Zam -Buk, మిణీశా స్త్రీ $Humb_u(K)$
లతాంతార్ద్రిరాగంబు లంబాడిలంగా....

౩

కాకికేమితెలుసు psycho analysis ?
ఆటవెలది ద్విపద కత్తగారు;
5. 3. 2; ఆ ముక్త మాల్యద;
విశ్వదాభిరామ వినురవేమ.
(పాఠాంతరం: దీని భావమేమి తిరుమలేశ)

౪

హాంగ్‌కాంగ్‌లో
కింగ్‌కాంగ్‌తో
ఓరాంగ్ టాంగ్ ఆడిన
పింగ్ పాంగ్ లాగు !!!

(సశేషం, బహుశా)

# విదూషకుని ఆత్మహత్య

కొవ్వొత్తు లారిపోయినై
క్లోరోఫారంలా చీకటి కమ్మింది.
ప్రపంచం తన మరణశాసనం రాసుకుంది
విదూషకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.

యంత్రాల మంత్రగానం
విషధూమాల తుపాను
స్లీపుల్లో చింపంజీ
నాందిలో భరత వాక్యం
మృత్యువులో సృష్టి
విదూషకుని ఆత్మహత్య.

విదూషకుని వికట హాసంలో
కపాలం పకాలన్నది
ఆకలి అన్నం వండుకుంది
హింస ఆకాశం అందుకుంది.

విదూషకుని విషాదం
సముద్రంలో బడబాగ్ని
భూకంపంలో ప్రూట్‌శలాడ్,
కాని
కొవ్వొత్తులు మళ్ళీవెలిగి
మరణశాసనం మండిపోయింది.

# టాం టాం

నిన్ను
ఇంద్రుడవనీ. చంద్రుడవనీ
ఇంద్రుని సుతుడ వనీ
చంద్రుని హితుడ వనీ

ఇంద్రసుతుని హితుని మేనమామ వనీ
చంద్రహితుని సుతుని బావమరది వనీ
కరి కరి భిత్
గిరి గిరి భిత్ - కబుర్లతో
కవులు పొగడడం మేం వి
న్నాం. వి
న్నాం

కాని నువ్వు
పురుగువనీ నురుగువనీ ఏమీ
ఎరుగ వనీ
వొట్టి చేట పెయ్యవనీ

కొయ్యవనీ గుడ్డి గవ్వ
చెయ్యవనీ

గోడమీద నీడవనీ
చేతకాని వాడవనీ
పెద్దలక్క బొమ్మవి వాజమ్మవనీ
మేధావద సాధారణ
గాధలు మేం నమ్మమసీ

కష్టం కావచ్చుగాని
స్పష్టం గానే మేం అం
టాం : అం
టాం.

# కొంటె కోణాలు

ఛందో బందోబస్తు లన్నీ
ఛట్ ! ఫట్ ఫట్‌మని త్రెంచి
Damn it ! ఏమిట్రా ఇ ? దంటే
Pray ! It's poetry అందాం.

అర్ధాన్ని అధ్వాసపు అడవిలో వదలి
గద్యాన్ని పద్యానికి పెళ్ళిచేదాం.
కాదన్న మాదన్న యెవడన్నా ఉంటే,
వేమన్న యేమన్నాడో చూడ మందాం.
హాష్ హూష్, హూష్ హాష్ అని కేకలు వేసి
కావ్ కావ్ మ్యావ్ మ్యావ్ అందాం గమ్మత్తుగా.
న ... న.... న.... న.... నత్తిమాటలు కూడా
మ....మ....మ....మ....మన వ్రాతల్లో ఉందొచ్చు

అచ్చా ! స్వేచ్ఛాజీవి !
ఐతే, కైతే నీ వ్రాతని
argument కోసం ఒప్పుకున్నా,
పానుగంటివారు ఒప్పుకోరు.
పానుగంటివారు ఒప్పుకోకపోతే
పాముపంటి డానికి విరుగుడుంది.
ఇంద్రకంటివారి నడిగితే
ఏమిటంటా రో తెలుసునా ?

"పులికి పిలక లేదనడం
చలికి తెలుగు రాదనడం :
శ్రీనివాసరావు వ్రాస్తున్నది
మానిషాద గీతంలో ఉన్నది."

కట కటా ! లొటిపిటా చస్తే
కృ. శా. విషాదకావ్యం వ్రాయాలా ?
Sex లో x కర్థం తీస్తూ
చలం కలం పట్టుకోవాలా ?

జీవ్రాకి algebra చిహ్నాల
లాంకోటూ పాంకోళ్ళూ తొడిగి
సాహిత్య పౌరోహిత్యం ఇస్తే
పెర్రికాదు surrealism రా సోదరా.

# సదసత్సంశయం

౧౦

కలడు కలండనెడు వాడు
కలడో లేడో అంటూ
లోగడ ఒక ఏనుగు ఆ
లోచనలో పడిందంట

హోరా హోరి మకరితో
పోరి నడుం జారి తుదకు
"నాన్యధా స్తి శరణ" మనుచు
దైన్యంతో నిలిచిందట

విహ్వల నాగేంద్రుని మొర
విని—అప్పుడు కదలెనంట
ఆపన్న జనావన బిరు
దాంచితుడైనట్టి వేల్పు

చక్రంబున నక్రంబును
సంహరించి ఆ పిమ్మట
స్థల జలచరు లిరువురికీ
సాయుజ్య మొసంగెనంట

## ౧౧

ఇది జరిగిన కథ కాదని
ఎవరో కల్పించిందని
ఇంచుక యోచించ గలా
డెవడైనా గ్రహిస్తాడు

ఆ విషయ మటుండ నిచ్చి
అసలు సంగతికి వద్దాం
ఈ గజేంద్ర మోక్షణ కథ
ఏఁవిటి చెబుతుంది మనకు :

నీ శక్తికి విలువ లేదు
నీ యత్నం పనికిరాదు
దైవబలం ఉందే అది
అమేయమూ, అజేయమూ !

అందుచేత చేతులెత్తి
లొంగిపొమ్మ్ము బేషరతుగ
అపు డాతని కృపచేత స
మస్తం సౌఖ్యాంత మగును

తాతా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ
Cell : 9441518715



పిరికితనం నూరిపోయు
పిట్ట కథలతో బానిస
మానసికత నగ్గించే
మన పూర్వుల నేమనాలి ?

రాచరికపు రోజుల్లో
ఎగుడు దిగుడు సమాజాన
పాలకవర్గాధిక్యం
నిలబెట్టే పూనికతో

మనిషి నిలా తగ్గిస్తూ
మరోదాన్ని ఉగ్గడించి
పరమాత్ముని పేర మత
ప్రవక్త లైనారు వారు

వాళ్ళ నెందు కనడంలే
ఇది మనలో జీర్ణించిన
ముది తత్వం, ఈ సరికీ
వదలి పోని మురికిమందు

(సశేషం)

# ఎ ఏ ఐ ఒ ఓ ఔ

ఎ

ఎక్కడ ఎప్పుడు
ఎవరైనా చెప్పుడు ఈ చిక్కు విప్పుడు
ఆరంభం ఎక్కడ
అంతం ఎప్పుడు
ఎందుకీనొప్పులు ఏమిటీ చప్పుడు

లక్షలు లక్షలు
యక్షప్రశ్నలు అన్నీ తప్పులు
ఏచోట జననం
ఏపూట మరణం
ఈలోపున ఎన్నెన్ని పడరాని తిప్పలు

కంట్లో కారం
ఒంట్లో భారం గుండెల్లో దాహం
ఉచ్ఛ్వాసం నిశ్వాసం
ఒకే అనుప్రాసం
సందేహం పన్నుతుంది సరోరుహవ్యూహం

ఆగమనం నిష్క్రమణం
అంతా ఒక చంక్రమణం ఆలోచించు బాగా
ఎదైతే సవాలు
అదేలే జవాబు
ఒమీగా ఆల్ఫా, ఆల్ఫా ఒమీగా

శాస్త్రం నీ అస్త్రం
మౌనం.శ్మశానం అదికాదు జ్ఞానం
పరీక్షించు సహేతుకంగా
ప్రసంగించు సాధికారంగా
సమష్టిసూత్రం మాత్రం సరైన విధానం

ఏమిటీ చప్పుడో
ఎందుకీ నొప్పులో అంతం ఎక్కడో
ఆనందం ఎప్పుడో
ఆ చిక్కు విప్పుడు
ఎక్కడా ఎప్పుడూ ఎవ్వడూ చెప్పడు

ఏ

ఏదైనా గీతం
చేదైనా మై మరపిం
చేదైనా మది కదిలిం
చేదైనా ఎద రగిలిం
చేదైనా ఏదైనా
నేదైనా
రేపైనా
ఏమైనా గానం

జడి జడిగా వర్షం నా
మెడమీదా
తొడమీదా
తడితడిగా రక్తం నా

గదిలోనూ
హృదిలోనూ
దడదడగా కంపం నా
నడినెత్తిని రంపం

నాకోసం ఆకాశం
చేకూర్చే ఆవేశం
రేగించే ఉద్రేకం
ఊగించే ఉద్వేగం
దావానల హాలాహల
కీలోజ్జ్వల కోటీరం
నీలోత్పల కాసారం
నీలోపల కేయూరం

కనిపించక జడిపించే
కికురించే సకిలించే
కిటికీలో రూపం వా
కిటి ముంగిటి ధూపం
గాలంవలె ఱూలంవలె
వేలాడే కాలం
వేటాడే వ్యాఘ్రం అది
వెంటాడును శీఘ్రం

కాలానికి భయపడితే
కలిగేదే శోకం
కదిలేనా లోకం
దొరికేదా నాకం

కనుపాపలు తెరచాపలు
ప్రళయంలో పయనం
నిరయంలో శయనం
విలయంలో విజయం

ఐ

ఐక్యం అదీ మనకి ముఖ్యం
అందులోనే ఉంది సౌఖ్యం
లేనిపోని చీలికలు
రెండురెండు నాలికలు
ఛీ యిదా బతుక్కి
ఫాయిదా

ఐక్యం అదీ వ్యవస్థ
అప్పుడుండదు మనకీ అవస్థ
కాదు ఔను అవును
కాదు కాదు అవదు
అనేకం అయితే ఏకం
అదే వివేకం

ఐక్యం అన్నింటికీ మూలం
అదే కదుల్తోంది కాలం
పురోగతి ప్రపంచ నీతి
మనదొకే మానవజాతి
వ్యక్తికి బహువచనం
శక్తి

ఐక్యం అదే మనకి గమ్యం
అప్పుడే సిద్ధిస్తుంది సామ్యం
వ్యర్థం స్పర్థంటా
యుద్ధం వద్దంటా
కామ్యం ఐక్యం అయిన బతుకే
రమ్యం

ఐక్యం ఎప్పుడో కాదిప్పుడే
ఎక్కడో కాదు అదిక్కడే
మాట చేతగామారి
మనిషి మనిషితో చేరి
స్వప్నం సత్యం ఐతేనే
స్వర్గం

ఓ

ఒకనొక అనగా అనగాల వేళ
(అది కృతయుగం
కాదు మృతయుగం)
అదే మన కథలకీ కవిత్వాలకీ డోల

మనుష్యుని బాల్యంలోని అమాయకత్వం
(ప్రార్థించే మొక్కలూ
మాట్లాడే నక్కలూ)
కళలో జీవితంలో నిదర్శించే అరణ్య తత్వం

సామూహికం స్వాతంత్ర్యం అన్వేషించు అగత్యం
(ఒంటరితనం
తుంటరితనం)
సామాజికంగా పెరుగుతుంది స్వేచ్ఛ ఇది సత్యం

అజ్ఞానం చీకటి భయానికీ క్రౌర్యానికీ కాణాచి
(శిశుత్వం అదే
పశుత్వం అదే)
చంపడానికి సరదా అమ్మయ్యో బూచి

మార్పాలంటా ఇదంతా ప్రసరించాలి కాంతి
(శాస్త్రం కళని చంపబోదు
జనాన్ని భయంతో నింపలేదు)
మానవాళికి పరిణామం కానుక పావురంలాంటిశాంతి

ఓ

ఓహో విహంగమా
ఎగురు
ఎగురు
నీ రెక్కల విసరులో మన్వంతరాలు
తరలు
తరలు

ఓహో తరంగమా
కదలు
కదలు
నీ ముంచెత్తు వరదలో నిమ్నోన్నతాలు

కరగు
కరగు
ఓహో మృదంగమా
పలుకు
పలుకు
నీవిచ్చు హెచ్చరికలో నిరాశా దురాశా భాండాలు
పగులు
పగులు
ఓహో జనాంగమా
నడువు
నడువు
నీ పరాంకోటి హసాలతో నూతన గవాక్షాలు
తెరువు
తెరువు

బొ

బొను వాహనం మారింది; దూరానికి పూర్వపు
టర్థం పోయింది
పూర్వ దూరం పోయింది వెనకటి వాహనం
మారింది
ఆ సూర్యుడే నేడూ
ఆ చంద్రుడీనాడూ
అవే నక్షత్రాలూ-ఐనా కాలం మారింది
బొనా కాలం మారింది మరి ; మానవుడా మేలుకో
నేస్తం

ఎద్దుబండితో కొలవకు దూరాన్ని ఎగరవోయ్
చదలయెద చీలుస్తూ

రేపు బయల్దేరా లనుకున్నావు
నేడే ఇచ్చటికి వచ్చేశావు
విచ్చేసింది నీ తరుణం పుచ్చుకో ఇది నీభావి
ఇది నీ భావి గ్రహించు : ఈ భావి నీకు నా
పెర్మిజెంటు

భూతకాలపు సరీసృపాలని పాతరాతి యుగంలో
పారేయ్

పాతెయ్ నీ సందేహాలని
తోలెయ్ నీ మందాక్షాలని
నిటారుగా నిలబడు నేస్తం హుటాహుటిగా
ముందుకిసాగు

హుషారుగా ముందుకిసాగు : ఊరిఖే వెనక్కి
చూస్తావేం

దుప్పివీ కుక్కవీ కావు తిర్యగ్గ్రుక్కవి నువ్వు
కావు

దూరం కరిగిపోతోంది
కాలం మరిగిపోతోంది
మానవుడిగా మేలుకో నేస్తం ఏలుకో ఈవిశ్వం
సమస్తం

# అభిసారిక కడసారి

ఆకాశంమీద రాకాసికోర
ఏడకయ్యా పోతావు
కోరచుట్టూ నెత్తుటి చుక్కలు
ఏడకయ్యా పోతావు
కనుమలోనిది - కొ-కొ-కొ-కొలిమి
వెళ్ళకయ్యా చెడతావు
నీడచూడకు నీకేహాని
సంకేతం నీ శ్మశానం

వింతైనది విహంగం
ఏడకయ్యా. పోతావు
చూపులలోనివి సూదులు
ఎందుకయ్యా పోతావు
'పడుచుదనానికి జడుపులేదు
సంకేతం నాసరస్సు'
వెళ్ళకు వెళ్ళకు చస్తావు
నాచునిండిన కోనేరు

ఏమిటి దంతపుచర్మంమీద
ఎర్రని పచ్చని దేదోమచ్చ
లోతులోయలో భూతాలు
కొలిమి నిప్పులో గుర్రాలు

సూదికి కంట్లో సోపానం
కాళ్ళకి కళ్ళు సంకెళ్ళు
సంకేతం నీ సాల్వర్సాన్
జలపాతంలో జంఝూటి

# ఒకటీ - పదీ

ఈ ఫస్టోబరు రోజు ఎవరా వస్త
చెప్పండి కొత్త ఎవరా వస్తున్న రాజు

ఆరంభ మంగళముహూర్తం ఆసన్నమయింది
ఆహ్వానంకోసం మా గానం ఆయత్త మయింది

అయితే ఆ వస్తున్నది ఆం అవునో కాదో
ఆస్వాదించబోయే అనుభవం ఆఖరికి తీపో చేదో

శ్రీరాములుచుట్టి చిత్తగించవలెను దాకా
ప్రవహించిన విజయ ప్రభవించే తనయ

ఆం కాకపోతే ఏం అందులో ఒక ముక్క
ఆ ముక్కలో ఒక చెక్కఅయినా ఇదే మా ఓం

అదో పదో నెల బాల
హాస విశాల
పుట్టింటి కొస్తోంది
పూర్ణ గర్భిణి



తారంగం తారంగం లాలీ లాలీ
ఆనందం ఆనందం హాయీ హాయీ
శంఖాలు ధంకాలూ మ్రోగించండీ
స్నేహార్ద్రం సౌహార్దం సాధించండీ

రైలుబండి లేటయిందా
వంతెనచుట్టూ వరదలా
ఇంజన్ సరిగ్గా లేదూ
ఎందుకదంతా పోదూ

పూలదండతో
నిండింది స్టేషన్
కోటి గొంతుకలతో
పాడింది నేషన్

పదిలంగా పొగబండి
చేరింది డెస్టినేషన్
రారండీ రారండీ యావన్మందీ
ఆడండీ పాడండీ హ్లాదం చెందీ

3

ఆంధ్రరాష్ట్రం ఆగమనం
అసత్యం కొఱ్ఱాలని చారిత్రక వాగ్దానం
మన చరిత్రాత్మక నిరంతరాందోళన
చరితార్థమయిందీ నాడు

ఈ రాష్ట్రం ఇదిగో ఇప్పుడే చెబుతున్నా
ఏదోకొందరి సదుపాయాని కేర్పడలేదు
ఎవరో కొందరుద్యోగులకని వేర్పడలేదు
ముక్కోటి ఆంధ్రుల అకుంఠిత దీక్ష

అజేయ సంకల్పం
ఆంధ్రావతరణకి కారణం
ఈరోజు ఊరేగింపులు జరుగుతాయ్ నిజమే
ఉత్సవాలు జరుగుతాయ్ నిజమే
ఉత్సాహం ఉప్పొంగుతుంది నిజమే
యథావిధిగా అన్ని లాంఛనాలూ సాగుతాయ్ నిజమే

కాని ఆ లాంఛనాలన్నింటి తర్వాత
వచ్చిన అతిథులు వెళ్ళిపోయిన తర్వాత
పాటలూ ప్రసంగాలూ జయజయధ్వానాలూ
చల్లబడ్డ తర్వాత

సంబరాల తర్వాత
సంపాదకీయాల తర్వాత
సామాన్యమానవుడి భుజస్కంధాలమీద
సమస్తభారం పడుతుంది
అతనిదీ ఈ రాష్ట్రం
అతనికోసం ఈ రాష్ట్రం
పెత్తనం చెయ్యాలని ముందుకొచ్చే
పెద్దలిది గ్రహించాలని హెచ్చరిక

శుభంగా శోభావహంగా
ఆకారం తాల్చుతున్న ఆంధ్రరాష్ట్రం
ఆంధ్రజాతి కంతటికీ విజయం
ఆంధ్ర సంస్కృతికి అఖండ విజయం
ముఖ్యంగా అతి ముఖ్యంగా
ఆంధ్రభాషకిది అపూర్వ విజయం

ఇది వినండి మరి
విప్లవం ముస్మ్మందు మనుష్యుని మనస్సులో
ప్రారంభమవుతుంది
మనఃప్రపంచానికి బాహ్య స్వరూపం భాష
భాషావిప్లవమే భావవిప్లవం
అందుకే ఈ ఆనందసమయంలో
భాషలోనూ భావంలోనూ విప్లవంతెచ్చిన
మహా మానవులైన
మన గిడుగు గురజాడ వీరేశలింగం
మహనీయులను
నా మనఃఫలకంముందు సాక్షాత్కరింపజేసుకొని
నమస్కరిస్తున్నాను
వారిచ్చిన ఆశీర్వాదాలు
తీర్చిదిద్దిన ఒరవడులు
చిరకాలం మన ఆంధ్రావనికి
శ్రీరామరక్ష
దేవతలో మానవులే దీవించాలి
దేశంలో దేవత్వం దీపించాలి.

౪

ఈ పట్టాభరు భవభేళ
నిన్నటి మన స్వరూపం స్మరించి
నేటి మన స్వభావం గ్రహించి
రేపటిమనసమాజంకోసం కలిసిమెలసిక్రమించుదాం

నిన్న మన ఓడరేవులనుంచి దేశదేశాలకి
మన నాగరికత నౌకాయానాలు చేసింది
నేడు మన రహదార్లు ఎద్దుబళ్ళకి ఏడుపు
తెప్పిస్తున్నాయ్
ఇనుపదార్లు ఇరుకై పోయినాయి
రేపు మన విశాలాంధ్ర విమానాశ్రయాలనుంచి
మహాకాశాల్లో మన విమానాలు ప్రయాణంచేస్తాయ్.

నిన్నటి మన రాజనగరాల్లో
రత్నరాసుల విపణివీధులు
విదేశీయులకి విభ్రాంతి కలిగించాయ్
నేడు పట్టణాల పాలకసంఘాలు
దరిద్రాలను తరిమివెయ్యలేక
అంధకారాన్ని అరికట్టలేక
అటమటించి అల్లాడుతున్నాయ్

రేపటి మన జల విద్యుత్ ప్రణాళికలు
సిమెంట్ కాంక్రీట్ వినిర్మాణాలు
ట్రాక్టర్లు బుల్‌డోజర్లు
పారిశ్రామిక వ్యావసాయక సహసమానాభివృద్ధితో
ప్రతికుటుంబానికీ ఒక నివాసగృహం చూపిస్తాయ్
ప్రతివ్యక్తిచేతికీ ఒకపని కల్పిస్తాయ్
ప్రతిమనస్సులో ఒకపరిభ్రమైన గీతం పలికిస్తాయ్

నిన్న మనదేశం మహామంత్రులైన అక్కన్న
మాదన్నలని లోకానికిచ్చింది
నేడు మంత్రిపదవుల మంతనాలతో వాతావరణంలో

దుమ్ము దుమారం చెలరేగింది
రేపు జాతినంతటినీ ఏకమార్గంలో నడిపించి
అఖిలభారతావనికే ఆదర్శం చూపించగల
మహానాయకుడు మనకు లభిస్తాడు
నిన్న తమకంపె హెచ్చువారికాళ్ళు పట్టుకొనికొలిచి
తమకన్న తక్కువవారిని కాళ్ళకిందపట్టి అణచి
చిరునవ్వుతో స్తిమితంగా సర్దుకుపోయే మన స్తత్వం
నేడు ఆ మన స్తత్వపు అవశేషాల నెదిరించి
పోరాడుతున్నవారి తిరుగుబాటు
రేగించిన ప్రచండ సంఘర్షణల
ప్రభంజన గర్జన
రేపు మానవుడు మానవునిలోని మాన
వత్వం గు ర్తించి మాననీయములైన
సరికొ త్త మర్యాదలు సృష్టించే
మహ త్తరకాలం
నిన్న కవిత్వానికి రాజాధిరాజుల ఆదరణ
నేడు ప్రభువులలో పరిపాలకులలో ఇంకిపోతూన్న
రసహృదయం
ఆనందానికి అవకాశాలూ తీరుబాటూలేని
అసంఖ్యాక ప్రజానీకం
రేపు మేలుకొన్న ప్రజలు శిరస్సునధరించి
ఆదరించే అతినవీన కవితామాధుర్యం
సంతోషం సంరంభం నేడేనేడే
సౌమార్గ్యం సౌభాగ్యం రేపేరేపే

# నగరంలో వృషభం

నగరం నడి వీధిలో
వృషభం తీరుబాటుగా
గత జన్మ సంస్మృతులు కాబోలు
కనులరమోడ్చి నెమరేస్తూ
కదలకుండా మెదలకుండా
నగరం హృదయంలో వృషభం
దారికి హక్కుదారు తానే అయినట్టు
పరిత్యజించి కాలానికి బాధ్యత
పరిహసించి నాగరికత పరుగు
నిలబడింది నేనే రాజునని

ఎవరు పొమ్మనగల రీ ఎద్దుని
ఎలా చూస్తోందో చూడు
ఏయ్ ఏయ్ మోటారుకారూ
ఏఁవి చేఁవిటి సీ తొందర
భాయ్‌భాయ్ సైక్లిస్ట్
భద్రంసుమీ ఎద్దు నిన్ను తప్పుకోదు
యంత్రవిరోధి అహింసావాది శాఖాహారి
మద్యనిషేధ ప్రజ్ఞాశాలి
నగరం నడివీధిలో
నాగరికత గమనాన్ని నిరోధిస్తూ
ఇలా యెంతసేపయినా సరే
ఈ యెద్దు నిలబడగలదు

ఎద్దుకి లేకపోతె బుద్ధి
మనిషికేనా ఉందొద్దా ?

# అధివాస్తవికుల ప్రవేశం

కాసరమా వికారములు కార్చకు పూసరమా మసారపున్
రాసులలో కపాలములు రాల్చకు తావళమా విషాదపున్
వేసములో కుశాసనము పేర్చకు రాసభమా సమాధిలో
మీసము పెంచి మాతొడల మీద నటించకు పుణ్యమయ్యెడున్

నిచ్చెన పచ్చినెత్తురులు నింపి నిలింపుల దుంపత్రెంపి కొ
ర్చిచ్చులు త్రచ్చుకొన్నది శచీపతి పీచుమిఠాయి వేటలో
పచ్చిక మచ్చికైనది షిపాకర భీకర సూకరాకృతుల్
పిచ్చిదనాలుపోయిరి కబీరును త్రాగిన రోషనారలై

ప్రాతది సూదికన్ను పొరపాటున తా తెరచాటుచేసి ఘో
షా తిలకించబోయి వెదజిల్లును గుమ్మడి పూదుమారముల్
లేతది రావికొమ్మ పడలేదు భయానక దందశూక ని
ర్ఘాతపతాక దానికొరకై యిరుకైనవి సందులెందుకో

గంధముగా మెడన్ పులుమగా తలపోయుదు వంధకారపున్
బంధకి యూర్చు జాలి చనుబాలను గాలముచేసి లాగుచున్
సింధువు పిల్చినా పరిహసించెడు నైగల : సుప్తలోణ పా
ణింధమ ఖడ్గధార హవణించకుమీ తిలకాష్ఠ వహ్నిలోన్

మ్రింగి తిమింగిలాంగల తమిస్రగుహాంతర మీనమేష పా
రంగతులైన బొంగరములార యెరింగిన తెల్పుడా పరి
ష్వంగము పాడుపొందుకు ? విపంచికి కంచికి దూరమెంత ? వ
ర్ధంగుల రంగులా గులకరాళ్ళగు మాగుడిలోని లింగముల్ ?

ఉద్యమ నాయకా చదువుకోఁ వినిపించని కంచుకాగడా
వాద్యములన్ నిశానిశిత వల్లరి అల్లరి యల్లికన్ సము
త్పాద్య సుధావృథావ్యథలు భాషకులొంగని భావశాఖలో
చోద్యము లూహలో మలుపుచూడ్కులు నీతలమున్కకాన్కలై

కైకొని కాకికన్ను కలకాలపు చూపులు రెక్క రిక్కపై
పైకొని మేకుతాకిడికి ప్రాణము హాయి బజారు జారుడై
డాకయికై కడాని పగడాల గుడారములో విడాకులై
రోకల రోదనాకులత రోదసినిండిన రోగభోగమై

మౌనము శంఖమై చెరగుమాయగ నేత్రపతంగ బింబ ని
ధ్యానము కొంగనెత్తురులు త్రాగెడు నల్లతురాయి పూవుగా
వేనలిపై అవే అయిదువేల కుఠార దారుణ
ప్రాణ శిలీంధ్రముల్ తిరుగుబాటు తుపాకి తుఫానుకాసుపుల్

వచ్చెడువాడు ఫల్గుణుడు వార్ధితరంగ మృదంగ ఘోషలో
విచ్చెడు మచ్చమందు పలవించెడు కించి దుషస్తుషారముల్
పచ్చిక మచ్చికైనది ప్రపంచపు నెత్తురు మంటపాటలన్
మెచ్చనివాడ నీ మెడలమీద నివే ఉదయాద్రి రౌద్రముల్

# మహాకవి ఆశ్చర్యం

సూసూది కొసవలె సూక్ష్మమైన ఒక లోకం. నా ఆలోచన అయస్కాంతం. అణువులో ఆలాపన, కలంలో కలకలం. అణాలో ఆల్కెమీ. ఆరాధనలో ఆముదం. జింటాన్ నన్ను తింటానంది. రత్నాలు 9. రసాలు 9. ఆకాశనేత్రంలో అష్టాదశ పురాణాలు. ఇంద్రధనుస్సు వాయిస్తూ ఎవరో పాతుతున్నారు. ప్రవాళ ద్వీపంలో మరకతమంజీరం కాబోలును?

## ఆంబోతులు

మరచిపోయి చూచినవి, చూచి మరచిపోయినవి, అనుకొని ఆలకించినవి, ఆలకించినట్లు అనుకున్నవి, ఆకస్మికంగా ఆఘ్రాణించినవి, రుచిచూచి రచించినవి, స్పృశించి అనుభవించినవి, రమ్మంటే రావు. వొద్దన్నా వొస్తాయి. నాటక శాలలో గురకపెడుతూ, జంతుప్రదర్శనశాలలో పియానో వాయిస్తూ, వస్తు విక్రయశాలలో వేణ్ణీళ్ళు తాగుతూ, బ్రిడ్జిపక్క పిల్లిమొగ్గలువేస్తూ, లాడ్జిలో కూర గాయలు కోస్తూ ఎప్పుడో వస్తాయి. ఎలాగో చూస్తాయి.

## కెమీరాకన్ను

చంద్రకిరణాలనే శాశ్వతంగా తాగలేము. సందులో వుంది సాహసం. జడవనివ్వదు సౌందర్యం. సరదాకొసని కొరడాకొసని సరదాకొసని కొరడా. నాయిష్టంవచ్చినంత రాస్తాను. ఎక్కడ ఆగాలో ఎరుగుదును. అధరం నాఆదర్శం. బింబంలో ప్రతిబింబం.

## మేహం దం సం

కూర్చొని చేసిన పాపం గుడికట్టినా పోదు. చిన్నప్పటిమాట. ఆడపిల్ల బడిలో అపెండెన్సు రిజిస్టరు తస్కరించినతర్వాత చేతిలోపని చేతిలోనే అయిపోయింది. "అన్ననాన్న, ఎంతపని చేశానా" అనుకున్నాను. కొన్ని సంపాదకీయ రచనల కంటె నయమే అనిపిస్తుందిప్పుడు.

## కైమా - చేసిరి

పిల్లి తాగుతూన్న పాలలాగు బాధతో పడుక్కున్నాను. కొన్ని రూళ్ళ. కర్రలు. వాటి కొక దారంకట్టి లాగుతూ పందికొక్కులాంటి పొడుందొక్కు వస్తోంది. సీసాలు తే. పసుపుపచ్చని పత్రికలు కట్టుకొని పెళ్ళికూతురయింది వాస్తవికత.

## శారదాబిల్లి

ఛందస్సు (గాయత్రీ సాక్షిగా చెబుతున్నాను) ఎటు తిరిగితే అటే ఒరుగు తుంది. విధానంలో వికారం. మాత్రలు మింగడం నాకు చేతకాదు. అల్లిక రంగ వల్లిక. అంకెలు మన సంకెళ్ళు. అడగవయ్యా ఆర్థికశాస్త్ర పండితుణ్ణి. పర్వతం పండి బద్దలవుతోంది. లావా—

## దేవీ

శ్రావణ శుద్ధ దశమీ సోమవారం మెడమీద అవతారాలు కప్పుకొని చంద్రుడు తొంగిచూశాడు. బడబాననంవలె భయంకర మనోహరమైన పయోధి. అదృష్టంవలె, అఘుంవలె, నౌకాభంగంవలె, నగ్ననక్షత్రంవలె. నలు చదరపు నీలిమందు. అందులోనిది తిమింగలం. దానికొక బొత్తానా. దంతాలసందున కార్ఖానా.

## బొరత్‌ఖానా

జరత్కారుని చమత్కారంలాగు నన్ను నేను తిరిగేసి తొడుక్కున్నాను.
అడుకునుంచిచూస్తే అస్థిపర్వతం;
అగ్నిపంజరం. మీదనుంచి చూస్తే మేగ్నాకేసు; మీరట్‌కార్టా.
అర్థంకాదు ఆలాపన. అయితే —అబద్ధంకాదు ఆశ్చర్యం.

## మహారాజశ్రీ

కళ్ళ పిడికిళ్ళలో కర్పూర నీ హారం ధరించి, ఉపమానంవంటి ఉల్కా గ్రైవేయంతో కనీనికాధిష్ఠిత కాళిదాసుడై, ప్రబంధగ్రంథ గంధగజాన్ని అధి రోహించి అకస్మాత్తుగా సాహిత్యకరించాడు మహాకవి ఆశ్చర్యం.

అతివా (!!!!)

రానేవచ్చావు ఎలాగూ, కళ్ళతోనయినా ఒకమాట ఆడుదూ—లాల్చీ విప్పేస్తా నన్నాను. బహిరంగ రహస్యాలు బయటపెట్టడాని కేమున్నాయి? అందరూ అనుకుంటున్నవే. తలలలో దాచుకుంటారు. కలలలో కరవ్వాస్తాయి. అన్నీ నాకు 64 లాగే కనబడతాయి. పరధ్యానంగా ఉన్నప్పుడు అర్థమవుతాయి.

ఆల్కెమీరా

అన్నిటిలో అందంవుంది. అర్థంవుంది. కావలసినన్ని ఉపమానాలకీ అక్కర లేనన్ని ఉపమేయాలు, ఎక్కడో పోలిక దొరుకుతుంది. ఎక్కడో చేతులు కలుస్తాయి, స్నేహం చేషడుతుంది. ఇంద్రనీల మణులను కరగించి ఎవరో సముద్రాన్ని సృష్టించారన్నావే. ఆ మాట ఋజువుచెయ్యగలవా? కార్మిక ఘర్మకఠోరక్షరతలో కడలికి రూపం కలిగిందని నేనంటేనా కోపం? అదో దృక్పథం. అదో చిత్తవృత్తి. ఆ స్థితిలో అన్నీ క్షమిస్తావు. అన్నీ రుచిస్తాయి.

దృక్కోణం

స్వప్నాలను కోస్తున్నాడు శస్త్రవైద్యుడు. .... లలో, మేఘాలలో,.... యలలో. లోయలలో ఉన్నవి ఉంటాయి. పోయినవి పోతాయి. నీకెందుకుబాధ? బా....ధ. బా....అబ్బా....బా....

బా, బా, బా, బాం, బాం, బాం, బాంబు.

# వా టి ల వ మూ టి

ఒక మంచి శుక్రవారంనాడు (అయ్యో అంతమంచిది) నా భాషను మూట కట్టి, మూపున వేసుకొని, నా విశ్వాసంగల కుక్కను వెంటబెట్టుకొని బయలు దేరగా, సూర్యుడు చూస్తున్నాడు. పువ్వులు నవ్వుతున్నాడు.

నేను చేస్తున్న ప్రయాణపు దారిలో ఆగమని ఒక చెయ్యి అరిచింది. ఎవరి దా చెయ్యి అని ప్రశ్నించగా, (నేను కాదు, కుక్క) మాయమయింది. నేను ఆగలేదు. అక్కడే ఉన్నచెట్టు అంతసేపూ నేను చూడనిది నాకంటి నాకర్షించింది. దేవేంద్రుడేమో అని భయపడ్డాను, వెయ్యి కళ్లున్న ఆ చెట్టును చూచి. వాటిలో అన్నిటికన్నా ఒక పెద్దకన్ను ఆగమని అరిచింది. నా పదాలచప్పుడు భూమిలోని తన వేళ్ళద్వారా పసికట్టిందేమో. నేను ఆగలేదు.

నామూపున భారంగా తోచినభాష దాహంవేస్తున్నదని అరిచింది. అసలే ఆకలిగా ఉన్న నేను సరసులదారి తప్పిపోయాను. మంట ముళ్ళదొంకలు, నెక్కైె, పైపు పైటరు, హంస ఎందువల్లనో వరుసగా ఒకదానితర్వాత ఒకటిగా నా మనస్సులో దొర్లుతూ క్షణంలో కనబడి మరుక్షణం మాయమైపోయినది. నాకు వాటి అర్థంగాని అవసరంగాని అవగాహన కాలేదు.

నాకుక్క ఇంతలో జాలిగా అరిచింది. ఎవరా వస్తున్నవారు? ఎదురు గుండా గుండెలు బాదుకుంటూ, మూడు చీలికలుగా చీలిన నాలుకను జడిపింపుగా కదిలించుతూ, ఎవరా వస్తున్నారని చూశాను. మరు మరీచిక. మరీ చికాకుపడి, నన్ను నా అవజ్ఞతకు నిందించుకొని, నిలవకుండా నడిచిపోయాను.

నన్ను ఆగమని ఆజ్ఞాపించవద్దని అవ్వని ప్రార్థించాను. అవ్వకి బ్రహ్మ చెవుడు. ఆవిడచుట్టూ ఆవిడవంటివారే మూగి, ఆధ్యాత్మిక భజన చేస్తున్నారు. కొన్ని ప్రశ్నార్థకపు గుర్తులూ, ఒక విభూతిపండూ, రెండుమూడు అక్షింతలూ నామీద వేశారు. నాలో ధిక్కారం ఘీంకారం చేసింది. ప్రశ్నార్థకపు గుర్తులను మాత్రం మూటలో కట్టుకొని, వెళ్ళిపోయాను విసురుగా.

మూటలో విప్లవం. మాటలు కలుస్తూ, విడిపోతూ, నాట్యంచేస్తూ, ప్రాకుతూ, మొగ్గలువేస్తూ, పాడుతూ, అరుస్తూ విప్లవం.

కొమ్మల బండీరాకాసి నాకేసి చూసినప్పుడే వివర్ణత తటస్థించింది. గుణితం ద్విగుణితమయింది. ఓ అధ్వానపు బతవీ, అసారకాసారమా (.) ఆగ

మన్నవాడిని నేను నన్ను ఆగమన్నప్పుడు నే నెలాగ ఆగలేదో ఆలోచించుకొని అన్నానా, లేదులే.

కొన్ని మాటలు లయగా కలయగా వాటిధ్వనులవల్ల ఒక శక్తి రేగింది. కవిత్వం పట్టుకో అన్నారు. చిన్న పిల్లల గొంతుకలోనికి పారిపోయి దాగుంది. వార్తాశీర్షికలూ, సినీమాప్రకటనలూ నన్ను ఆకర్షించడం మానలేదు. కార్టూన్ చిత్రం కలతపెట్టి, కలలు పుట్టిస్తుంది. హల్లుల అడావుడికి అచ్చులు విచ్చుకత్తులు, అచ్చులమాట వచ్చినప్పుడు ఆర్ద్రర్ రింటో జ్ఞాపకంవస్తాడు. మనలో వర్ణభేదం పోయిందికాదు, సంక్రాంతికి రంగులేదు. నిఘంటువుకి నిప్పుపెట్టి.

తర్వాత కొంతకాలానికి ఒక గడుసుపని చేశాను. అది నా రహస్యం. ఒక్క నా కుక్కకుమాత్రమే ఎలా తెలిసిపోయిందో తెలిసిపోయింది. నేను చాలా భయపడ్డాను. ముఖం చేతులలో మూసుకున్నప్పుడు చేతులలో ముఖం కనబడింది. నా కన్ను పేరు కామాక్షి.

ఇంతలో విశ్వనాధ సత్యనారాయణవేషం వేసుకొని, నన్నయభట్టుగారు కనబడ్డారు. నమస్కరించాను. నమ్మలేదు. ఆ మూట విప్పమన్నారు. మీ వేషం విప్పండన్నాను. వీలులేదట. ఈరీతి మేము హోరాహోరిగా పోరాడుతుండగా, రుక్మిణీనాధశాస్త్రి వేషం వేసుకొని రుక్మిణీనాధశాస్త్రి వచ్చాడు. ఆ మూటలో ఏముందో నాకు తెలుసునన్నాడు. రెండేరెండు అక్షరాలు, శ్రీశ్రీ అన్నాడు. నా కాశ్చర్యమయింది. నన్నే నేను మోస్తున్నానంటే నమ్మలేకపోయాను.

[టీక: మన భాషలో అతివాస్తవిక రచనకు ఇదే మొట్టమొదట ప్రయత్నం. అతివాస్తవిక రచన అంటే మనస్సంచారంలోని అసంలక్ష్యక్రమాన్ని పైకి తేవడం అన్నమాట. రూపం సరిగా ఏర్పడని ఊహలకు రూపం ఇవ్వడం. "మంట, ముళ్ళడొంకలు, నెక్తై, పైపుర్తై, హంస ఇవి ఎందువల్లనో వరుసగా ఒకదానితరువాత ఒకటిగా నా మనస్సులో దొర్లుతూ క్షణంలో కనబడి, మరుక్షణం మాయమైనవి" అన్న వాక్యంలో పైన అన్న వాక్యం సమన్వయిస్తుంది. అసార కాసారమా (.)'కాసారమా'లో సారపోతే, కామా.(,) 'ఇది' మనకు కొత్తదికాదు. వసుచరిత్రలో, సారసలోచనలున్నచోట రసభంగం అంటే సాలోచనలౌతారు అన్నదానిలాంటిది ఇది. ఐతే, నాకన్ను కామాక్షి, కామా చూపులు చూచింది అన్నతో, కొత్తే. పువ్వులు చూస్తున్నాడు. చెట్టు అరవడం ఇవన్నీ అతీతమైన ఊహకు నిదర్శనాలు. — సంపాదకుడు.]

# ఎన్నాళ్లీ ఇంకా

గండభేరుండపు రెక్కలతో ద్వేషంవచ్చింది. పేదవాళ్ళతో చెప్పింది "మిమ్మల్ని దోచుకున్నా" రని.

మురికి కాలువలను చూపిస్తే నగరం మొగం చిన్నబోయింది. ఫాక్టరీ గొట్టంలో ప్రతిధ్వనించిన కేకవిని కార్మికుడు తుళ్ళిపడ్డాడు. అతని కళ్ళలో ఆహాశ్చర్యం.

ఎన్నాళ్లు అంది ఎలెక్ట్రిక్ ట్రైయిన్, ఎన్నాళ్ళు అంది ట్రాంబండి, బస్సు, జట్కా, రిక్షా, ఎన్నాళ్లు అంది షాపునోరు. ఎన్నాళ్లు ఎన్నాళ్లు అంది కాలేజి అంది అసుపత్రి అంది మ్యూజియం.

నడివీధిలో వాన

ఎక్కడయినా దొరుకుతుందా ఒక్క పుష్పం అని వెదికాను. ఏ కాఫీక్లబ్బుకూడా నన్ను ఆహ్వానించలేదు. ఈ చీమలకు రెక్కలు వస్తే ఏందారి అనుకున్నాను.

ఎన్నాళ్లు అంది ద్వేషం.

కళపెళ కాగుతోంది రక్తం. బిగిసుకుపోతున్నాయి సంకెళ్లు. పిడికిలిపట్టి ఆకాశాన్ని బెదిరించాను. వికటంగా నవ్వింది మెరుపు. ఉరుము నన్ను ఓదార్చింది.

ఎన్నాళ్లు అంది వాన.

తాతా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ
Cell : 9441518715

# అనువాదాలు

# ప్రా మ వే ద ం

గురజాడ అప్పారావు

పాడకోయ్ కవీ ! కాంగ్రెస్ ఒక
భజనసమాజం మాత్రమే అని !
ప్రతినిధులంతా నిద్రపోయినా
భవనం క్రిక్కిరిసిన సత్రమే సుమీ !

కాంగ్రెస్ నిత్యం, కాంగ్రెస్ సత్యం
స్వపరిపాలనం కాంగ్రెస్ గమ్యం !
ఆత్మ అనే దీపం వెలిగేందుకు
ఆదర్శమనే తైలం ముఖ్యం !

కాంగ్రెస్ యుద్ధం - రూల్సుప్రకారం
కాగితాలతో ! నామకార్థకం !
అడపాదడపా అంతఃకలహం !
అయితే బిల్‌కుల్ అహింసాత్మకం !

మితవాదులు నేర్పే గుణపాఠం
ఏయే యెండల కా యా గొడుగులు !
కాదని బరిదిగి తిరగబడేవో
ద్వీపాంతరమే ! లేదిక తిరుగుడు !

కావున జోరుగ కంఠశోషగా
ఉపన్యసిస్తూ నుంచుందాం !
అస్తమానమూ లాభం చూడక
రాజభక్తితో పొంచుందాం !

[1908 మద్రాసు కాంగ్రెస్‌మీద గురజాడ అప్పారావుగారు ఇంగ్లీషులో
వ్రాసిన పేరడీకి అనువాదం.]

# ద్వేషగీతం

## పాల్ ఎలార్డ్ (PAUL ELUARD)

ఔనుమరి బూర్జువా వర్గాలన్నా
పోలీసురాజ్యం
పూజారి రాజ్యంఅన్నా
నాకు విపరీతమైన ద్వేషం
అయితే వీటిని నేను
ద్వేషిస్తున్నంత తీవ్రంగా
ద్వేషించనివాణ్ణీ మరీ తీవ్రంగా
ద్వేషిస్తాను
అసలు నేను వ్రాసిన కావ్యాలన్నింటిలో
ఈ ద్వేషగీతం చాలా బాగుందని
ఎవడైతే అనడో
ఆ దొంగతొత్తుకొడుకు మొగంమీద
ఉమ్మ్మతాను.

(అనువాదకుని గమనిక :- మూలంలో దీని శీర్షిక Critique de la poesie "కావ్యవిమర్శ" అని.)

# వాడిదే, ఇంకోగీతం

(La Rose Publique –"పబ్లిక్‌రోజా" నుంచి. A Personality Always New – "అనుక్షణ నవీన మోహిని" అనే కావ్యశకలం. పబ్లిక్‌రోజా అంటే వీధుల్లో తిరిగి మానం అమ్ముకుంటేనేగాని తినం వెళ్ళని దీనురాలు. ప్రజలగులాబి– వాడవదిన– చాలునా, ఇంకా స్పష్టంగా చెప్పాలా?)

కత్తులు
వాడిగా బలంగా
వాటికి బరువే లేదు

కత్తులు
పెనుగులాడే జనసమూహాన్ని
చీల్చుకుంటూ
అలిసిపోయినవి కొన్ని
డాబుగా దర్పంగా పోయేవి కొన్ని

కత్తులు రౌద్రవిగ్రహాలు
వికారపు కుళ్ళు బికారులను
వెంటాడుతూ వేటాడుతూ

కత్తులు
అనంతాకాశంలో అంతిమ నక్షత్రాలు
గాలిలో ఖైదు తలుపుల్లాగ

కత్తులు
ఏడవడానికీ ఎన్నటికీ
ఏడవకపోవడానికీ

కత్తులు
ఉషఃకాలపు పూల కాగితాలను
చీల్చి చెండాడడానికి
అన్నంలాగు నల్లగా తెల్లగా ఉండే
జీవితపుగళ్ళ పునాదులను
చిన్నాభిన్నం చెయ్యడానికి

కత్తులు
ఊపిరిమీద విషపాత్రికలాగు
వరదలబాధను కనిపెట్టే
ఉజ్జ్వల విషాదపు నగ్నబాహువుల్లాగు
అర్థంలేనిదానికే అంతం తెలుసుకోవాలని.

# పబ్లిక్ రోజా

## (PAUL ELUARD పాల్ ఎలార్డ్)

భూతకాలపు పునీత దివసాలు
వాటి జాఖువాసింహాలు వాటి ఖుభ్రజలాల సాఖువాలు
గర్వించిన వాటి ఉరుములు ఘుడియలను బూరటిల్లజేసే
ఉషఃకాల
శృంఖలాల
ఉష్ణరక్త ప్రవాహాలతో
అన్నీ ఆకాశానికే అడ్డుగా
ఒకేఒక హృదయపు
ఒకేఒక ముకురముద్గరంమీద
వాటి వైడూర్య కిరీటం వసివాడిపోతే
చలికాలం శాఖోప శాఖలతో
శవంవలె కఠినాతి కఠినం
సందొకటి జన సమ్మర్దంనుంచి
సన్నగా తప్పించుకు పోయింది
సందునిండా ఏకాంతం
అందులో ఒక బల్లమీద మనిషి
దారిచేస్తుంది సందు
దారుణ వేదనా కఠోర యంత్రాలకు
పెల్లుల్లి (జాబిల్లి) పాయలకు
కంకర రాళ్ళ కాలువలకు
ఘనీభవించిన శిలావిగ్రహాలకు
సందుచేస్తుంది దారి

మంచితనాన్ని మరిచిపోవడానికి
సందుచేస్తుంది దారి
సాహసం సీసాలోని
సత్య సంస్మృతుల పీలికలకు
నల్ల వెలుగు పురాతన జ్వాల
అల్లకల్లోలంలో ఒళ్ళు తెలియక
జుట్టు చిక్కుకొని వ్యూహంలో
దారి తప్పిపోయిన మనిషి
తలుపే పోల్చుకోలేడు
తాళం తియ్యనేలేడు
జ్ఞానం కావాలంటాడు
ప్రేమం కావాలంటాడు
వర్ణనలకు లొంగని శిథిల వైభవాలు
కాలణా కన్న జాలిగొలుపుతూ
పాపం వాటి కన్నాలలోంచి
పాడుకుంటూ ప్రవహిస్తాడు సూర్యుడు
పాలు చిలుకుతూ ఆకాశం
పాట పాడుతూఉంటే ఆకాశం
పాడుపడిన గోడలమీద
పాత కథలు పుష్పిస్తాయి
నీడలకు జోల పాడుతూ
నిర్మలమైన ఆలి చిప్పలు
వాటికింద తిరగబడే మంట
రక్తనాళాల మంట

అందుకో హస్తాల నాలోకించు నేత్రాల
ఆక్రమించుకో ప్రకృతిశోభను
బలాత్కారంగా
రాజుగారి దివాణం వెనక
మూతబడ్డ దుకాణం వెనక
కాళీడబ్బాల పక్క
గంధపు కూజాల మాటున
మొగాడి ముందు
పరాగ నిర్మోకం విడిచి
పరుండిన రహదారిమీద
జ్వరాల గుర్రాలు లాగగా
అదే సుదినాల దండయాత్ర
నీలి బాకులతోట
తెరుచుకున్న కనుబొమ్మల కింద
గుబురుటాకుల గుంపులలో
సుఖం పండించిన బరువు పంట
పత్తిపువ్వు బురఖాలను చింపుతుంది
సారంతెలిసిన రంగు ప్రక్షాళిస్తుంది ముఖాలకు
కాని నేడు ఖర్చుపడ్డ వీధులకు
కడుంగడు దూరంగా
కాళరాత్రిని శాసించే ఈ పాట
కళ్ళుపొడిచి చెవులు చిల్లులుపెట్టే ఈ పాట
కటికచీకటి భూతాలకు కొగిళ్ళిచ్చే ఈ పాట
ఈ ప్రేమ ఈ నిస్వార్థ ప్రేమ

బాగా తడిసిన కన్నీళ్ళతో
బాధతో గిలగిల్లాడే ప్రేమ
ఈ వికలిత విత్రుటిత విలులిత
మీ విచలిత మీ
వికటపు వేళాకోళపు స్వప్నం
ఉప్పొంగిన ఈ సంగీతపు వరద
వేడుకొనే ఈ వెలదుల సేన
ఏలన ఈ లలన
హేమాన్నే ప్రేమించింది
ప్రేమపు పరిపక్వతనే
జీవితమంతా కామించింది

After every war, poets of every Shade gather and philosophize.

# ఒకరో పలువురో

## (PAUL ELUARD పాల్ ఎలార్డు)

ఒకరో పలువురో
తుపానుపై నిద్రించే నీలిమ
పక్షులపై మంచు
కాతర కాననసీమల భీతిధ్వనించే గణగణ

ఒకరో పలువురో
మంటి ఆలిచిప్పలమధ్య మాలకాకుల్ని జిల్లారు
మాసిపోయిన రెక్కలమీద భూకంపం చంచువుమీద
గాలివాన గులాబీల ఎర్రని ఆశ్చర్యాలు సేకరించారు.
ఒకరో పలువురో
సూర్యుని వడ్డాణం
బ్రహ్మాండపు కూష్మాండం మార్తాండుడు
గుబురు తోటల సీసా మెడమీద

ఒకరో పలువురో
వానకన్న పెలుగు దినాలకన్న
బాల్యాన్నే స్పందిస్తూ
చల్లని నిద్దుర కనుమలకన్న చక్కగా స్పష్టంగా
చిడిముడిపాటుకు దూరంగా
ఒకరో పలువురో
అల్లరిబాజా అడ్డాలలో
తెల్లారగట్ట వాళ్ళ అరుపు చీరలాగ చిరుగుతుంది

ఒకరో పలువురో
విసిరిన రాళ్ళతో పెదజల్లిన పెంట్రుకలతో చేయబడి
చేయబడి కంటకాలతో, బట్టలతో, మద్యంతో,
నురుగుతో,
నవ్వుతో, ఏడ్పులతో, వదలిపెట్టడంతో,
అసందర్భపు టాందోళనలతో
రక్తమాంసాలతో
నిస్సందేహంగా నిజమైన నేత్రాలతో నేయబడి

ఒకరో పలువురో
తమ సమస్త దోషాలతో, సమస్త సుగుణాలతో,
సుగుణాలతో,
లలనాతతి

ఒకరో పలువురో
మొగానికి దంతపు బురఖా
అప్పుడే వండిన అన్నంలాగ ఆశపెడుతూ
నన్ను రెచ్చగొట్టే ఆడవాళ్ళంతా
అలంకృతలై అల్ల నే వాంఛించిన దానితో
అలంకృతలై ప్రశాంతితో సరికొత్తదనంతో
అలంకృతలై ఉప్పుతో నీటితో సూర్యునితో
సారళ్యంతో, సాహసంతో, ఒక పెయ్యి
చిలిపిదనాలతో
ఒకపెయ్యి గొలుసులతో

ఒకరో పలువురో
నాకల లన్నిటిలో
ఒక కొత్త అడవిపువ్వు
కట్టెమోపులవంటి కింజల్కాల అనాగరిక పుష్పం
గాయపడ్డ చీకటిలో

ఒ·రో పలువురో
మరణించతగిన యౌవనం
క్రూరంఘోరం అశాంతిమయమైన యౌవనం
చిరాకులతో వరదలెత్తే యౌవనం
నాతో పంచుకుంది
నా ఒక్కడితోనే
ఇతరుల లెక్కలేకుండా !

# విషాదనగరం

## (PAUL ELUARD పాల్ ఎలార్డ్)

మరుగుజ్జులు లేని
మధురమైన హృదయ నిదారకాలుగాని
ఎడారి దారుల్ని చూపించే
ఎర్రని గంధర్వ కాంతలతో నిద్రిస్తాం మనం
నిద్రిస్తాం మనం
ఒక రెక్క మనల్ని బద్దలుకొట్టింది
ఎక్కడకో పోతాం మనం
ఎగసిపోయిన ఎరకలకన్న
వయస్సుమించిన చక్రాలు మనవి
దారి కనబడదు మనకి
శ్వేతార్గమనపు శ్మశానాలలో
సాగించాలి మన అన్వేషణ
అదొక్కటే మనకు మిగిలిన
ఇంద్రియ లోలత్వం
మన గాయాలకి కట్టిన కట్లమీద
కప్పుకొనే సీసా
ఎప్పుడూ ఈర్ష్యని ప్రతిఘటించదు
తీసుకో హృదయాల్ని మస్తిష్కాల్ని
ఆగ్రహ కండరాల్ని
తీసుకో పాలిపోయిన బాలిక
ముడుచుపడిన బాలకుల
అదృశ్య పుష్పాల్ని
అందుకో స్మృతిహస్తం

మూసుకో జ్ఞాపకాల కళ్ళు
బందిపోట్లు కల్పించిన వృషశాస్త్ర సూత్రాలు
మనల్ని కొట్టి విభజిస్తాయి
అన్ని ముక్కలూ మంచివే
వీటిని మళ్ళీ ఏకంచేసే దెవరు
భయమా బాధా అసహ్యమా
ఇక నిద్రపోదాం సోదరులారా
ఇదివరకు వ్యాఖ్యానించలేని అధ్యాయం
ఇప్పు డర్థమే కాకపోతోంది
మహారాక్షసులు కదుల్తున్నారు
భయంకరంగా ఊపిరితీస్తూ
మహారాక్షసంగా ఊపిరితీస్తూ
ఉషస్సులాగ అరుస్తూ
అరవడం మానలేని ఉషస్సు
ఆనాటినుంచీ సోదరులారా
ఆనాటినుంచీ.

# నా కాయానాల తర్వాత

(PAUL ELUARD పాల్ ఎలార్డ్)

దూరదేశాల నౌకాయానాల తర్వాత ఈ రేవునే చూస్తానెప్పుడూ
ఇంకోసారి ఈ వసారాని ఈ వెచ్చని నీడని సముద్రపునురగ చల్ల
గాలుల చనుబాలిస్తుంది మళ్ళీ చూస్తాను మన గదిని నీతోకలిసి మన
కోరికల వంటవార్చే గదిని ఎప్పుడూ చూస్తాను నీ నగ్నత్వపు నీరసం
తెల్లవారుజామున కరిగిపోయే చుక్కల్లో కలిసిపోతుంది ఔను నే
నెరుగుదును కళ్లుమూసుకొని చూస్తేచాలు కనిపిస్తాయి నిన్ను సమీ
పించనిచ్చే వన్నెవన్నెల విలాసాలన్నీ జ్ఞాపకంవస్తాయి మళ్లా కళ్లు
విప్పితే మరోమూల కుళ్ళిపోతున్న గొడుగు మంచిరోజులమీద నమ్మ
కాన్ని సూర్యుడిమీద జీవితంమీద నమ్మకాన్ని భగ్నంచేస్తుంది వెలు
తురులో నిన్నింక ప్రేమించలేను నిన్ను వెదుక్కోవడానికి బయల్దేరిన
రోజు బాధపెడుతోంది నా గుడ్డితనం నా మూగతనం ఈ బోధపడని
ప్రపంచంముందు నువ్వు ప్రోత్సహించే అంగీకారం ముందు

నీ చిలిపిచేష్టలచేతనే నీతో పోరాడిస్తున్నానంటే నా నిజా
యితీలో నువ్వుకూడా ఎందుకు వాటా తీసుకోవు ?

ఎంత నన్నేడిపించావుకావు ? ఇక నీదగ్గర కెప్పుడైనా వస్తే
ఎందు కనుకున్నావు ? రాత్రికంటె ఎక్కువ వైశాల్యంలేని అర్థంలేని
నా జీవితపు మహారహస్యాన్ని తడిమి చూసుకొని ధైర్యంతెచ్చుకోవ
డానికి నేను వచ్చీరాగానే పడవలన్నీ ప్రయాణం కడతాయి వాటినిచూసి
తుఫాను వెనుకంజవేస్తుంది జడివాన విడిపిస్తుంది పేరులేని పువ్వుల్ని
వాటి పునర్వికాసం దూదిగోడలమీద ఎదురుదాడి చేస్తుంది ఔను నేను
ఎరుగుదును నీకో నిశ్చయంలేదు కాని మనమధ్య అబద్ధం బతకలేదు

తాతా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ
Cell : 9441518715



మనంచేసే పొరపాట్లు మనకన్న మర్యాదగా బతగ్గలవు ఎన్నాళ్లయింది ఈ తలుపు తెరుచుకోవడం నిరాకరించి ఎన్నాళ్లయింది అశ నిరాశ కాహారమై ఎన్నాళ్లయింది నీ చిరునవ్వులు కన్నీళ్ళుగా మారి.

ప్రేషకులకు లోనికి ప్రవేశం లేదన్నాం ఏముందిక్కడ చూడడానికి ? జ్ఞాపకం ఉంచుకో ఒకతెవే ఉన్నప్పు డీ జనంలేని సంగీతంలేని రంగస్థలాన్ని ఇంతే ఈజీవిత నాటకం ప్రపంచరంగం ఇక్కడ మనిద్దరంమాత్రం ఏమిటో దీని అర్థం మనిద్దరం అదేమాట వేరువేరు నౌకాయానాల వేళలలో ఆగిన వేరువేరు రేవులలో మనం ఇద్దరం కలిసే ఉన్నాం నిజం కలిసేఉన్నాం నాకు తెలిసింది కలిసే ఉన్నాం మనిద్దరం కలిసేఉన్నాం మనం నీకూ తెలియదు నాకూ తెలి యదు మనిద్దరం విడివిడిగా ఉన్న వేళలకి ఇద్దరం కలిసిమెలసి ఉన్న వేళలని కలపడం ఎలాగో నీకూ నాకూ తెలియను నీలోనుంచి నన్ను నాలోనించి నిన్నూ తీసివెయ్యడం ఎలాగో

నువ్వూ నీడవి నేనూ నీడని కాని ఈ నీడలోనే మనం ఇద్దరం అని మరిచిపోతాం

# యుద్ధరంగం

[ఫ్రెంచినుంచి అనువాదం]

కుళ్ళిపోయిన ప్రపంచంతో విసుగెత్తిపోయింది నీకు
కుతుబ్‌మీనార్ ఈ వుదయం గోలచేస్తూ అరవబోకు
నీ పంతెనల గొంతుకలతో నీ గొర్రెల మందలతో
వేదాల పురాణాలనాటి వెర్రికలల వందలతో
ప్రాచీన రథాల బార్లు
ఇచ్చటి మోటారు కార్లు
ఇక్కడ మతం ఒక్కటే నవీనం తతిమ్మా సమస్తం దగా
మతం ఒక్కటే ఋతం, శాశ్వతం, విశాలమైన విమా
నాశ్రయంలా అమాయకం,
భారతదేశంలో బుద్ధు డొక్కడే బతికున్నాడింకా
ఈనాటి అతి నవీన కవి ఒక్క శ్రీ శంకరా
చార్యుడే. కంచి కామాక్షి గోపురద్వారాలు
తెరుచుకున్నాయి పీల్చివెయ్యాలని నీ పాపాలు
నువ్వు మాత్రం సిగ్గుతో ఒప్పుకోవు నీదోషాలు
నువ్వుమాత్రం చదువుతావు గోడలమీద సమాసాలు
జీవిత భీమా కరపత్రాలు; షేరు మార్కెట్ తమాషాలు
ఇదిగో నీ న్యూస్‌పేపరు–ఇవాళ ఉదయపు సరికొత్త కవిత్వం
అణాడబ్బులికి కొనుక్కో హత్యలూ అసత్యాలూ పశుత్వం
సారస్వతానుబంధంలో ప్రముఖుల జీవితవిశేషాలు,
కొత్త కొత్త ఆకర్షణలు—కోటికోటి విచిత్ర శీర్షికల పతాకాలు
ఇవాళ ఉదయం చూశానొక యెంచక్కటి వీధి ఏమిటి చెప్మా
దానిపేరు

సూర్యుడిలో తడిసి శుచిగా శుభ్రంగాఉంది శంఖధ్వని దానినోరు
డైరెక్టర్లు కార్మికులు అందమైన పైపిస్టు అమ్మాయిలు
ఆ వీధిలో నడుస్తారు సోమవారం ఉదయంమొదలు
శనివారంరాత్రిడాకా రోజుకు నాలుగు పర్యాయాలు
ముమ్మారు ప్రతి ఉదయం మూలుగుతుంది సైరన్ మంట
మధ్యాహ్నం సరికి వినబడుతుంది మతిచెడిపోయిన గంట
షాపుల మొగాలమీద సాహిత్యం గోడలమీద సంగీతం
చిలకలాగ చెప్పిందే చెప్పే ఈ పారిశ్రామిక వీధిని చూడ్డం
ఎంతో నాకు సంతోషం.

మళ్ళీ నీ చిన్నప్పటి వీధి నువ్వో చిన్న బొమ్మప్పుడు
నీలిలాగూ తెల్లచొక్కా తొడిగింది మీ అమ్మప్పుడు
దినదినం దేవుడి గుడికి ఈవీధంబే వెళ్లావు
నీతో ఒక నేస్తం మీ భక్తికి హద్దుల్లేవు
దేవుణ్ణి మించిన రహస్యం లేనేలే దా రోజుల్లో
రాత్రిపడ్డాక చీకట్లో కునుకుదీపం వొణుకుల్లో
అమ్మపక్కని నిద్రించి అవేవేవో ప్రార్థనలు
మర్నాడు స్కూల్లో మాస్టరు ఆయన ప్రాతఃకీర్తనలు
మహాశివుని స్తోత్రం
అతని మండే మూడో నేత్రం
అతని కాలసర్పపు ఫణామణుల కాంతుల దివ్యసౌందర్యం
విస్ఫారిత మహాపద్మం వేయి కిరణాల వైడూర్యం
అతని ఆర్పలేని దీపం వాల్పరాని బావుటా
ఎన్ని గాలులు వీచినా ఎదిరించి నిలచే సింహాల జూలుకొగడా
అతడే క్రీస్తుకూడా అమ్మకి పుట్టిన కొడుకు
అతనే ఒక చెట్టు దాని చిటారు చివర ప్రార్థనల చిగురు
అవి కాలం కర్మం కలిసిన జంట జంటల ఎటాజూటాలు

అది ఆరుకోణాల నక్షత్రం మూడు మొనల వాలు
శుక్రవారం చచ్చిపోయి ఆదివారం బతికే యేసు
పైమానికులందర్ని మించి మీదిమీది కెగిరే క్రీస్తు
ప్రపంచపు విమాన రికార్డు పరమేశ్వరుడిదే
నాకంటిపాప క్రీస్తు ఇరవయ్యోపాప ఇంకా ఎన్ని శతాబ్దాలకైనా
శంకాతంకాలు లేకుండా ఒంటరిగా ఎగిరేమైనా
ఈ శతాబ్దం మారింది పిట్టగా ఎగురుతోంది ఈశ్వరుడి
సింహాసనం దిక్కుగా

గోతుల్లో దయ్యాలు మెడలెత్తుకు చూస్తాయి నిక్కుగా
దేవుడు దేవుడికి ఇమిటేషన్ అన్నారు లోగడ
ఎగురుతాడా అయితే—ఈగ అయినా నంబర్‌వన్ ఈగట
గంధర్వులూ కిన్నరులూ కింపురుషులూ ఈ యెగిరే క్రాపీజిస్టు
చుట్టూ

ఎగురుతారు ఈ మొట్టమొదటి విమానంతట్టు.
రెక్కలు ముడవకుండానే దిగుతుంది ప్లేను
రెక్కలేని పిట్టలతో నిండిపోతుంది సీను
ఆకాశం అనంతం అందులో పక్షులు అసంఖ్యం
కాకాలు ఘూకాలు ఫాల్కన్లు పుంఖాను పుంఖం
ఆఫ్రికానుంచి ఐబిస్‌లు మారబౌట్లు ఫ్లెమింగోలు
కవులు పాడే గండభేరుండం అరేబియన్ నైట్లరాక్ష్ణి
ఆది మానవుడి కపాలం గోళ్ళ యిరుకుల్లో ధరించి
అమెరికానించి వస్తుంది చిట్టి చిట్టి హమ్మింగ్ బర్డు
చీనానించి పీహీలు సిల్కురెక్కల గరుడులు
వాటి వింగ్‌స్పాన్ ఒక్కటే—ఎగరడం రెండేసి చొప్పున
దివ్యమైన సింబాలిజం- అయినా బోధపడదు చప్పున
ఇదిగో ఇది పావురం అనశ్వరం అమేయం

పైరు బర్డూ దాని అంగరక్షకుడు లక్షికళ్ళమయూరం
చితిమంటల్లోంచి లేస్తుంది రెక్కలాడిస్తూ ఫీనిక్సు
గ్రీక్పురాణాల సైరెన్లు వాటి సమ్మోహనకరమైన మ్యూజిక్కు
డేగ గూబ ఫీనిక్స్ పీహే కాండర్
అన్నిటికి స్నేహితుడే ఈ ఎగిరే వండర్
ఇవాళ పారిస్‌లో నడుస్తున్నావు ఒంటరిగా జనాలమధ్య
ఆలమందల్లా అరుస్తూ బస్సులు సాగుతున్నాయారధ్య
పాతప్రేమల బాధలు నీగొంతుపట్టి పీడిస్తున్నాయి
ప్రేమించనే ఇకలేనేలేవనే భయాలు నిన్నీడుస్తున్నాయి
ఏదైనా మహర్షి ఆశ్రమానికి పోదామని ఉంది నీకు
కాని ఇప్పుడు నువ్వు జపించే గాయత్రి నీగుండెల్లో బాకు
చిరాకుపడతావు నువ్వు నీ నవ్వు కాగితం పువ్వు
నరక జ్వాలలాంటి నవ్వు వెలిగిస్తుంది నీలోపలి దీపం
వెలుతురులేని చిత్రకళా ప్రదర్శనశాలలో ఒకరూపం
అదే నీ అంతర్జీవం దగ్గిరగా వెళతావు దానికోసం.

# ప్రణయం - స్మరణం

## సాల్వడార్ డాలి (SALVADOR DALI)

(అసంపూర్ణం)

ముద్దొచ్చే పరగణాలలో
(మరీ ముద్దొచ్చేవి మాత్రం కావు)
హఠాత్తుగా అతి మర్యాదగా లంకించుకొనబడి
వలస రాజ్యాల పలుకుబడి కలిగి
ఒక బురఖా
వడ్డీవలె రాబట్టుకొనబడి
ఏమయితే నేం
తలకిందులయి
ఏమయినా ఈ రాజ్యంతో
ఎందుకు మనకి పేచీలనుకొని
అయితే ఈ వలసరాజ్యంలో
అజమాయిషీ చేసే ఆఫీసు బెత్తాలు
ఇంకేవో అస్పష్టపు అసందర్భపు
అఫీషియల్ వస్తువులు
అన్నంలాగ పనిచేస్తూ
బాగా వండిన అన్నంలాగ
ఏడుపును పోలిన అన్నం
పిట్ట గూటిని పోలిన ఏడుపు
మూడు రంగుల్లో ముద్రించిన పిట్టగూడు
నా కవిత్వాన్ని సరిపోలినదై
నేను భయంకరంగా ధరించే కవిత్వం

షరతులున్నా సరే
లేకపోయినా సరే
వలస రాజ్యాల బురఖా ధరించిన వస్తువులు
ఏకీభవించి
"రొట్టెవలె నిశ్చలములగు వస్తువులు కలవు."
శక్తివంతంగా నైనా సరే
కాకపోయినా సరే
ఒక్క అంచుమాత్రం కలిగి
లేక
దవడ యెముకలు కలిగి
లేక
నాటకపు దుస్తులు కలిగి
లేక
తీగమీద నడవడం కలిగి
లేక
సగం వస్తువులు కలిగి
లేక
బోర్లించిన వస్తువులు కలిగి
లేక
తాళపు చెవి కలిగి
లేక
అనేక సదుపాయాలు కలిగి
లేక
మా అక్కయ్య ఫొటోగ్రాపు పక్కని
సూది దారం కలిగి
అడుగు బడ్డా
అన్నం మెతుకులూ కలిగి

# పుట్టని పాప ప్రార్థన

నే నింకా పుట్టలేదు : నా ప్రార్థన వినండి
గాలిధూళి మహామారి
బాలారిష్టాలు లేని
గద్ద గుడ్లగూబ రాని
గబ్బిలాలు జడిపించని బతుకివ్వండి

నే నింకా పుట్టలేదు : ఓదార్చండి
గోడలలో గోడలతో కుమ్మికుమ్మి
నల్లపుందు నిషాలలో ముంచిముంచి
అబద్ధాల కుతంత్రాలు కురిసి కురిసి
పైపైలలో చిత్రవధ
రైళ్లలో దోపిడి
మీ యుద్ధాలకు నన్నొక బలిపశువును
చేస్తారని భయం. దాన్ని పోకార్చండి

నే నింకా పుట్టలేదు : నాకోసం
వానలు కురిపించండి
పంటలు పండించండి
ఆడుకొనే చెట్లూ
పాడుకొనే ఆకాశం పక్షులతో స్నేహం
నా దారికి వెలుగిచ్చే తెల్లని దీపం
నా మనస్సు వెనకాతల వెలిగించండి

నేనింకా పుట్టలేదు : క్షమించండి
నా ద్వారా ప్రజలు చేసే పాపాలూ

నా పేరిట జరగబోయే మోసాలూ
నే నాడని మాటలు ఊహించని తలపులు
నే నెరుగని ద్రోహాల కుట్రలు
నా చేతులతో చేయించే హత్యలు
నా నాలుకతో పలికించే దొంగసాక్ష్యం
ఇతరుల బతుకుల ఫలితంగా నా మరణం
నా బతుక్కి ఫలితంగా ఇతరుల మరణం
నా భావి బాధ్యతలనన్నీ మన్నించండి

నే నింకా పుట్టలేదు : మీరే మప్పండి
ఏ పాత్ర ధరించాలో
ఏ మాటలు పలకాలో
ముసలివాళ్ళు నాకు నీతి బోధిస్తే
ప్రభుత్వాలు నా నడవడి శాసిస్తే
పర్వతాలు తమకోపం ప్రకటిస్తే
నన్నుచూచి హేళనగా ప్రేమికులు
రారమ్మని పిలిచే పెనుకెరటాలు
నా శవాన్ని నాశనాని కెరచేసే ఎడారి
నా బిచ్చం పుచ్చుకోని భిక్షుకుడు
నేనేం చెయ్యాలంటారో మీరే చెప్పండి

నే నింకా పుట్టలేదు : నా ప్రార్థన మదినుంచండి
పశుప్రాయుడైనవాడు
భగవంతుణ్ణనేవాడు
నా కుభయుల సంపర్కం వదిలించండి

నే నింకా పుట్టలేదు : నా కివ్వండి
నాలో గల మానవత్వ మెవరైతే అపహరించబోతారో

ఎవరైతే
నన్నొక యంత్రంగా మార్చాలని యత్నిస్తారో
బజారులో నన్నొక సరుకుగా
మొగాని కొక ఖరీదు తగిలించి
నా అస్తిత్వం ఎవరైతే చీల్చాలని చూస్తారో
అటూ ఇటూ
ఇటూ అటూ బంతిలాగ తంతారో
ఎవరైతే
నన్నొక నిర్జీవపు శిలనుచేసి
ఎపరైతే ఎవరైతేనేం వాళ్ళని
ప్రతిఘటించగల శక్తిని నా కివ్వండి
ఈ షరతులమీద నన్ను రానివ్వండి
లేదా నన్నీ క్షణమే చానివ్వండి

(లూయీ మేక్‌నీస్ గీతానికి ముక్కస్య ముక్కానువాదం)

# ప్రేమగీతం

(జేమ్స్ జాయిస్‌కు ఇమిటేషన్)

ప్రేము ప్రేమను ప్రేమించడాన్ని ప్రేమిస్తుంది
ప్రేమ ప్రేమను ప్రేముగా ప్రేమిస్తుంది
ప్రేమను ప్రేమించిన ప్రేము ప్రేముచే ప్రేమించబడిన
ప్రేమను ప్రేమిస్తుంది

నర్సు కొత్త డాక్టరును ప్రేమిస్తుంది
14 నం. కనిస్టీబు మేరీ కెల్లీని ప్రేమిస్తాడు
హంటర్‌వాలా హంటర్‌వాలీని ప్రేమిస్తాడు
నాయకులు నాయికలను ప్రేమిస్తారు
మనివాళ్లయ్య వాళ్ల వాళ్లమ్మను ప్రేమిస్తాడు
సరోజాబాయి సైకిలుమీద వచ్చిన కుర్రాణ్ణి ప్రేమిస్తుంది
వీధి కొసను అమ్మాయి గోడచాటున అబ్బాయిని ప్రేమిస్తుంది
చీచీచీ చీనావాడు చౌచౌచౌ చీనాదాన్ని ప్రేమిస్తాడు
ముసుగు మనిషి చచ్చిపోయిన మనిషిని ప్రేమిస్తుంది
మహారాజుగారు మహారాణీగారిని ప్రేమిస్తారు
మహిషం మహిషిని ప్రేమిస్తుంది
నువ్వు ఒకానొక రైను ప్రేమిస్తావు
ఆ ఒకానొక రై ఇంకొకా నొకర్ని ప్రేమిస్తుంది
భగవంతుడు అందరినీ ప్రేమిస్తాడు.

# ఛాయా భంగిమలు

జీవితానికి ప్రాముఖ్యం యివ్వను
జీవితపు కనీసపు పిపీలికలకు ప్రాముఖ్యం అంటించిన
జీవితానికి నా లక్ష్యంలేదు
కాని లవణ శాఖికలు ధవళ శాఖికలు
ఛాయాబుద్బుదాలు
సముద్రపు పలక పుల్లలు
నా ఊహాలలో ఊపిరి తీసుకోవడానికి దిగుతాయి
నావి కాని కన్నీళ్ళలోంచి వస్తాయి
నేను వెయ్యని అడుగులలోంచి
రెండుపెట్టి గుణించిన అడుగులలోంచి
వాటినిగూర్చి యిసుక ప్రోవులు కెరటాల రాకను స్మరిస్తాయి
పంజరం లోపల యినుపకమ్మ్ములున్నాయి
ఈ కమ్మ్మల ముందు పాడాలని పక్షులు
ఆకాశపు దూరంనించి దిగుతాయి
భూగర్భమార్గం పరీమళా లన్నింటినీ ఏకంచేస్తుంది
అక్కడ వొకనాడు నాకొక స్త్రీ వాగ్దానం ఇచ్చింది
ఈ మగువ మహాప్రకాశమానంగా వెలిగి
నాకు కనబడనే లేదు
ఈ కళ్ళతో
కాలిపోతూన్న నా తనువును కనిబెడుతూన్న ఈ నా కళ్ళతో
ఆమెను చూడలేకపోయాను
అప్పటికే నాకు యిప్పటి వయస్సుంది

బ్రహ్మాండమైన ఫాక్టరీని రాత్రి పారాజవానులాగ
నన్నూ నా ఊహలనూ కనిబెడుతున్నాను
ఒంటరిగా పారా యిస్తూ
అవే ట్రాం పట్టాలను యెల్లప్పుడూ అదే సర్కస్ సమ్మోహితం
చేస్తుంది

మట్టిబొమ్మల ముఖలక్షణాలేవీ మారిపోలేదు
చిరునవ్వు ఫలాన్ని కొరికినవాళ్ళు
మరిచిపోయిన నగరంలో మంచి బట్టలషాపు నెరుగుదును
ఆ బట్టలు వేసుకుని నీకు కనబడాలని అడిగావంటే
నీ అంతం సమీపించిం దనుకుంటావు
నా అంతంలాగే

ఆఖరికి ఔత్తానాలకి అర్థమవుతుంది ఔత్తానా అనకూడదని
తోడేళ్ళు మంచుటద్దాలని తొడుక్కున్నాయి
ఏ ఋతువుకీ చెందని వొకపడవ నాకుంది
మంటకోరల మంచు బండి నన్నులాగుతోంది
ఎప్పుడూ పచ్చగానే వుండే ఈ చెట్టునుకోస్తూ ఈడిగిల బడతాను
వైణికుడు తన వీణ తీగెలలో చిక్కుకున్నాడు

పెద్దబాలశిక్ష కథలో పేదరాశి పెద్దమ్మ
ఇంతవరకు నీడలాగే వున్న ఓడనెక్కిపోతుంది
హుశా ఈ కత్తి కొకపిడి ఉందేమో
కాని ఈపిడిలో అప్పుడే కలహం
ఈ పోరాటంలో వీరులకి ఆయుధాలు లేవు
మృత్యువు పెద్దనేరం కాదు

భవిష్యత్తు యెప్పటికీ రాదు
ఎన్నడూ యె త్తబడని తెరలు
ఇకమీద కట్టవలసిన యిళ్ళ కిటికీల దగ్గరకు తేలుతూ వస్తాయి
కలువపూలతో కట్టిన శయ్యలు
ప్రాలేయ దీపికలకింద జాలువారుతాయి
ఒకానొక సాయంత్రం వస్తుంది
సీలినాచుకింద వెలుగు ముద్దలు నీరవిస్తాయి
ప్రేమనీ గాలినీ ముడివేస్తూ ముడివిప్పే చేతులు
కళ్ళున్నవారు చూడగలిగినట్లు తమ స్పాటికత్వం నిలుపు
కుంటాయి
అరచేతుల రేఖల్నీ
కళ్ళలో కిరీటాల్నీ చూస్తారు
కాని కిరీటాలూ అరచేతులూ
అరణ్యంలోని అగమ్యస్థానాల్లో వెలిగించబడవు
సంవత్సరాల్నిపరీక్షించడానికి సారంగాలు శిరస్సులు వంచేచోట్ల
మంద్రాతి మంద్ర ధ్వనులు మాత్రమే వినిపిస్తాయి
ఆ ధ్వనులనుండి అనేకమైన చల్లచల్లని
పెద్దపెద్ద చప్పుళ్ళు సాగుతాయి
ఆ వాద్యం అనంతంగా మోగుతూనే వుంటుంది
స్పందించే చీరలు
ఆ స్పందనాలతో శ్రుతి కలిపే వాద్యం
వాటిని ధరించినవారి ముఖాల్ని చూడాలనుకుంటే
ఒక గొప్ప పొగమబ్బు నేలనుండి లేస్తుంది

ప్రాకారాలకి అడుగున
జీవితానికీ ఐశ్వర్యానికీ కాణాచులైన ఉగ్రాణాల వెనుక
రెండు కొండలమధ్య దాక్కునే లోయలలో
సూర్యుడు చల్లారిపోయే సమయపు సముద్రంమీద
నాకు సంజ్ఞలు చేసేవారిని నక్షత్రాలు వేరుచేస్తాయి
అయినా అమిత జవంతో పోతూన్న శకటం బోల్తాపడి
నా అంతిమ సంకోచందాకా తీసుకుపోతుంది
ఆ సందేహం నాకోసం వేచుకుని ఉన్న నగరంలో
కంచు విగ్రహాలూ శిలావిగ్రహాలూ
మైనపు విగ్రహాలతో మార్పుకు పాల్పడ్డాయి
మర్రిచెట్లు మర్రిచెట్లు

[ఆది వాస్తవికోద్యమ నాయకుడు Andre' Breton వ్రాసిన
Le Revolver aux chevevx blancs
'తెల్లవెండ్రుకల రివాల్వర్'— నుంచి]

# దిగువమతి చేసిన వచన గీతాలు

## నేపథ్య సంగీతం

గోరుచుట్టు ప్రాణాంతకం.

అంతకన్నా ప్రాణాంతకం బాధతీరా అరవలేకపోవడం.

హూకేల్లో ఉన్నాను. అటూఇటూ గదుల్లో మనుష్యులు నిద్ర పోతున్నారు. రాత్రి పెరుగుతోంది.

అరవడం ఎలా ?

అందుకని ఓ తమాషా చేశాను. నా మెదడు వొలిచి పీపా ల్లాంటి బాజాలూ, పాపాల్లాంటి బాకాలూ పైకి తీశాను. నా జ్వరంవల్ల రెండింతలైన శక్తితో వాటిలోంచి ఇల్లెగరగొట్టే సంగీతం పెల్ల గించాను.

ఆ చప్పుడులో నా అరుపులు వినబడవుగా !

ఇప్పుడు గొప్పగా అరుస్తున్నాను.

ఇప్పుడు నొప్పి కొంచెం తగ్గింది.

## సృష్టి

రొట్టెముక్కతో చిన్న జంతువునుచేశాను.

ఎలకనుకుంటాను.

బొసు. ఎలకే ! చిట్టెలక !

రెండుకాళ్ళు పూర్తిచేశాను.

మూడోకాలికి పాదం తయారుచేసేలోపుగా చిట్టెలుక చీకట్లోకి పారిపోయింది.

## ఇంద్రజాలం

"కాఫీ తే !"

సెర్వర్ వెళ్లాడు.

చాలామంది తింటున్నారు. నా సరదా పోరాటం.

"ఏమండోయ్, బాగున్నారా ?" అని నేను పలకరించను. కింద దవడ పగలగొట్టడం నా కుశల ప్రశ్న.

అడుగో, మీసాల ఆసామీ !

"ఏమండోయ్, బాగున్నారా ?"

ఆసామీ దవడ అతికించుకుంటున్నాడు.

మీదపడ్డాను. ఓకుమ్మ, ఓ గుమ్మ్, ఓగలీతా !

మొగ్గలేస్తూ మీది కెగిరాడు.

నిచ్చెనపట్టి కిందికి దించాను.

బండమీద ఉతికేను, పిండిపిండిగా పిసికేను, బల్లమీద పరిచేను.

ఇంకా బతికే ఉన్నాడు.

వీల్లేదు. వీడి అంతుచూడాలి. ఒక్కచూపుతో వీడి మొత్తం కూడికచేశాను. నన్ను నాలుగుతో హెచ్చవేసుకున్నాను. కొట్టేశాను. అరే ! మళ్ళీ నిలబడ్డాడు ! రెచ్చిపోయాను. వీడితల వెయ్యి చెక్కలు చెయ్యవలసిందే.

విసిరాను చెయ్యి !

నెర్వర్ తెచ్చిన కాఫీగ్లాసు ముక్కముక్కలయించి.

## నామీద ఫిర్యాదు

నేను చెప్పినప్రకారం చెయ్యనట.

ఏం చెయ్యను ?

దారుల కూడలిదగ్గర రాటబల్ల మీ ఊరు ఎటుందో చెబుతుంది. కాని తానే ఆ ఊరు వెళ్ళదు.

## జిబ్బుమనిషికి సలహా

జిబ్బుమనిషి ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదు. మిత్రులతో మాట్లాడినా ఎక్కువ వాగివాగి అలిసిపోతాడు కాబట్టి నర్సుతెచ్చిన మందు తాగడానికికూడా నీరసపడిపోతాడు.

అందుచేత జబ్బుమనిషి తనమిత్రులను తానే సృష్టించుకోవడం మంచిది. వాళ్ళు పక్కనుంచే డాక్టరు వచ్చినా ధైర్యంపోదు.

దుప్పటీ మడతల్లో చాలామంది స్నేహితులను దాచడానికి వీలుంది. వాళ్ళసైజు ఎక్కువైతే తగ్గించుకోవచ్చు. ఆకారం మాత్రమే ప్రధానం.

ఒకసారి నాకు జబ్బుచేసినప్పుడు తొలిరోజు పారిజాతపు పువ్వులు పెంచాను. దుప్పట్లన్నీ పారిజాతాలతో నిండిపోయాయి.

"పారిజాతపు పువ్వుల్లారా! పాటలు పాడండి" అన్నాను. అసలే అవి గగజ పొణికిపోతున్నాయి, ఆసుపత్రిలోకి వచ్చినందుకు! నామొగం, ఇక అవేం పాడుతాయి?

"పారిజాతపు పువ్వుల్లారా! పారిపొండి" అన్నాను.

ఈసారి వాటిస్థానే ఏనుగుల్ని రమ్మన్నాను. (చిన్నసైజు) అవి తీరుబాటుగా అటూ ఇటూ పచారుచేస్తూంటే నాకెంతో హాయిగాఉంది. వాటి చిన్నకళ్ళు నన్నర్థంచేసుకొని పలుకరిస్తే ఎంతబాగుంది, ఎంత బాగుంది!

కాని ఇంతట్లోకే అలుపొచ్చింది. చెప్పొద్దూ, నేను ఉత్త సోమరి పోతుని. కళ్ళుమూసుకొని అటు తిరిగిపోయాను. "దుప్పట్లోకొచ్చి తొండాలనుగురించి ఉపన్యాసం ఇవ్వండి. ఊగొడుతూ పడుక్కుంటాను" అన్నాను.

ఏనుగు లెక్కడేనా మాట్లాడతాయా? అవి ఉపన్యసించలేదు.

కాని ఏ ఉపన్యాసం చెయ్యకపోయినా ఏనుగులు నిన్ను కాపాడుతూ ఉంటే ఎంత ధైర్యంగా ఉంటుంది!

నిశ్చింతగా నిద్రపోయాను.

(ఫ్రెంచి కవి ఆన్రీ మీషో రచించిన "అంతరంగంలోని ఆకాశం"నుంచి. కొంచెం మార్పుతో)

# వికారి

ఒకనాడు

ఒకనాడు త్వరలో, బహుశా,

ఒకనాడు సముద్రంలో సుదూరాన నానావను నిలబెట్టిన లంగరు లాగిపారేస్తాను.

ఏమీ కాకపోవడానికి, ఏమీ కాకపోవడంతప్ప ఇంకేమీ కాక పోవడానికి కావలసిన సాహసంతో

నన్ను బంధిస్తున్న నన్నింటినీ విసిరి పారేస్తాను.

గొడ్డళ్ళతో కొట్టేస్తాను. తలకిందులు చేస్తాను, ధ్వంసం చేస్తాను, కిందికి దొర్లించేస్తాను.

ఒక్క దెబ్బకి నాలోని వెధవ సిగ్గు, వెధవ స్కీములు, నా సమంజసత్వపు మందగమనం నాలోంచి చంపివేస్తాను.

ఎవరో ఒకరు కావడమనే కురుపును పిండివేశాక, పుష్టినిచ్చే మహాకాశజలాలను మళ్ళీ తాగుతాను.

అవివేకాలవల్ల, పరాజయాలవల్ల (పరాజయం అంటే ఏమిటి?) బ్రహ్మాండాలు బద్దలవడంవల్ల, శూన్యంవల్ల, పూర్తిగా చెడిపోవడం వల్ల, వేళాకోళంవల్ల, ప్రక్షాళనంవల్ల, నా జీవితంలోనుంచి ఎంతో బాగా అంటుకుపోయిన, చక్కగా తీర్చిదిద్దిన, సమీకరించబడిన, నా పరిసరాలకీ, మిత్రులకీ, ఓహో చాలా యోగ్యులయిన మిత్రులకీ, సరిపోయిన స్వరూపాన్ని బహిష్కరించివేస్తాను.

మహోపద్రవంవల్లవలె వినమ్రమై, తీవ్ర కలహాసంతరంలాగ నేల మట్టమయిపోయి;

అట్టడుగుకి, నా నిజమైన హోదాకి, ఏ కారణంవల్ల వదలి వేశానో ఇప్పటికీ తెలియని నా ఎందుకూ కొరగాని స్థలానికి దిగిపోయి;

నిర్లక్ష్యానికీ, యశస్సుకీ పనికిరాకుండా నాశనమైపోయి; దూర దేశాలలో దారితప్పి (లేదా దారికూడా తప్పక), పేరులేక, అస్తిత్వం లేక;

వికారినై, అసందర్భాల బురదలో దొర్లుతూ, అందరి వెక్కిరింపులూ అందుకుంటూ, నాపై నేనారోపించుకున్న గొప్పతనానికి విరుద్ధంగా,

బికారినై, దమ్మిడీ లేకుండా, దమ్మిడీ చెయ్యకుండా, అందరికీ అందుబాటులో ఉన్న అనంతమైన అడుగు మనస్సులోకి గెంతేస్తాను;

నమ్మలేని ఒక నవీన తుషారానికి అర్హత పొందుతాను.

బండి సున్నా కావడంవల్ల
ప్రయత్నపూర్వకంగా
పనికిమాలిపోవడంవల్ల
నవ్వులపాలు కావడంవల్ల.

# ప్రాఫెసరుగారి రిపోర్టు

[భూమినుండి మానవజాతి తుడిచిపెట్టుకుపోయిన తర్వాత]

క్రిష్టోఫర్ లోగ్

అనగా అనగా ఒకగ్రహం
దానిపేరు భూమి
ఆ గ్రహంమీద ఒక వింతజంతువు
దానిపేరు మానవుడు

మానవుడికి రెండు కాళ్ళుండేవి
రెండు నమ్మకాలుండేవి
ఒకటి అదృష్టం
అన్నీ తనకు అనుకూలంగా సాగినప్పుడు
అలా సాగనప్పుడు
రెండోది నమ్మేవాడు
దాని పేరు మతం

మనిషి వెన్నెముక గల జంతువు
ద్విపాది
సర్వ భక్షకుడు
అకేశి

అన్నట్టు అతనికొక ఆత్మ ఉండేదట
దానికి మరణం లేదట *

మానవుడు మస్తుగా తినేవాడు
చెట్లనీ, చేపల్నీ, జంతువుల్నీ, పిట్టల్నీ నత్తలనీ
దొరికినవన్నీ పొట్టను పెట్టుకొనేవాడు
అప్పుడప్పుడు సాటిమానవులనుకూడా భక్షించేవాడు
కాని ఇది చాలా అరుదు

ప్రతిమానవుడికీ ఒక కార్జం
ఒకగుండె ఒక మెదడు ఒక జెండా ఉండేవి
ఇవే వాని ప్రధానాంగాలు
వీటిమీదే వాని బ్రదుకు ఆధారపడింది

అయితే కొందరు లేకపోలేదు
పగం కార్జమే ఉన్నవారు
ఎసలు గుండెలే లేనివారు
మెదడు లేనివాళ్ళు
కాని జెండా లేని మానవుడా ?
అసంభవం ?
చేతనాలలో మానవుడే అత్యంత ప్రముఖజీవి

* ఈ 'ఆత్మ' అనే దానికోసం ఖగోళాంతర పరిశోధక సంఘాలు చాలా కృషిచేశాయి, సమస్త విశ్వాన్ని గాలించాయి. కొన్ని అర్బుదాల అనశ్వరాత్మల కోసం వెదికాయి. ఒక్కటీ కనిపించలేదు. అయితే ఏమాట కామాటే చెప్పుకోవాలి. మానవుడు తనగురించి అబద్ధాలు ప్రచారం చేసేవాడన్న సంగతి అందరికీ తెలుసు.

—ప్రొఫెసర్ టుహాల్‌స్కీ

వానివల్లనే యుద్ధ పరిశ్రమల్లో
వాటాలకు విలువ పెరిగేది
సైనికుడై సంతోషపూర్వకంగా అతడు
మరణాన్ని వరించేవాడు
లేదా వింతవింత నేరాలు
గొప్పగొప్ప ఖూనీలు చేసేవాడు
అందువల్ల లక్షలకొద్దీ పత్రికలు
అమ్మ్మడు పోయేవి

ఇప్పుడా పత్రికలన్నీ అంతరించాయి
మానవ నైజాన్ని అనేకులు మెచ్చుకున్నారు
కాని అది రెండుగా చీలింది
ఒకటి మగ
ఆలోచించడం అంటే దానికసహ్యం
రెండవది ఆడ
ఆలోచించ నిచ్చారుకాదు ఆడజాతిని
కాని రెండుజాతుల్లోను ఒక సమానధర్మం ఉంది
అదే భయం
రోగం అంటే భయం
అప్పులంటే భయం
వార్ధక్యం అంటే భయం
ఒంటరితనం అంటే భయం
ఓటమి అంటే భయం
ముఖ్యంగా పొరుగువాడంటే భయం
అందుకే మానవుడు తాను
"బుద్ధిమంతు" డనుకొనేవాడు

మానవుడు రాజకీయ జీవి
ముఠాలుగా తిరిగేవాడు
ఒకగుంపు ఇంకోగుంపును ద్వేషించేది
అబ్బో ఎన్నెన్ని విద్వేషాలు !
అన్నింటిలో ప్రధానమైనది
దేశాభిమానం

మానవుడికి రెండు చెవులుండేవి కాని
ఏదీ వినిపించుకొనేవాడు కాడు
ఎప్పుడైనా వింటే
వాగ్దానాలూ
వాడి విలువనుగూర్చిన అంచనాలూ
అభినందనాలూ
విశేషించి, కృతజ్ఞతా ప్రకటనలూ
ఇవే వినేవాడు

మరికొంద రుండేవారు
విజ్ఞానులు, జిజ్ఞాసువులు, విప్లవ
కారులు, పైగంబరులు
కాని వీరు అల్పసంఖ్యాకులు
వీళ్ళని పెందరాళే పంపించివేసేవాళ్ళు
సిలువవేసి
షూట్‌చేసి
విషం ఇచ్చి !

మానవులతోబాటు దక్షిణాఫ్రికా
తెల్లజాతి అని ఉండేది
ఇది ఒకంతటగాని అంతం కాలేదు
ఆఖరికి ఇదీ అంతరించింది
వీరినిగురించి తెలుసుకోవడాని కేమీ మిగలలేదు

వచ్చేవారం మనం కుక్కల్నిగురించి
ముచ్చటించుకుందాం.

# జోన

[Guillanme Apollinhaire]

ఇవాళ పారిస్‌లో నడుస్తున్నావు ఒంటరిగా జనాలమధ్య
ఆలమందల్లా అరుస్తూ బస్సులు సాగుతున్నాయీరధ్య
పాతప్రేమల బాధలు నీ గొంతుపట్టి పీడిస్తున్నాయి
ప్రేమించనే ఇక లేనేలేవనే భయాలు నిన్నీడుస్తున్నాయి
ఏదైనా మహర్షి ఆశ్రమానికి పోదామని ఉంది నీకు
కాని ఇప్పుడు నువ్వు జపించే గాయత్రి నీ గుండెల్లో బాకు
చిరాకుపడతావు నువ్వు నీ నవ్వు కాగితంపువ్వు
నరకజ్వాలలాంటి నవ్వు వెలిగిస్తుంది నీలోపలి దీపం
వెలుతురులేని చిత్రకళా ప్రదర్శనశాలలో ఒక రూపం
అదే నీ అంతర్జీవం దగ్గిరసా వెళతావు దానికోసం

ఇవాళ నడుస్తున్నా వీ నగరంలో ఆడకళ్లు నిన్ను చూడవు
అందాలు నిన్నాకర్షించవు ఇవాళ నువ్వొక నీడవు
ప్రచండమైన నీ హృదయరక్తం ముంచెత్తింది నన్ను
పవిత్రమైన ప్రార్థన గీతాలు విరుస్తున్నాయి నా వెన్ను
ఏమిటనుకున్నావు నా ప్రేమ అదో సిగ్గుకలిగించే జబ్బు
నీకు నిద్రరాదు నా చుట్టూ భ్రమగొలిపే జ్ఞాపకాల మబ్బు

ఇంతట్లో కనబడ్డావు కావేరీ నదీతీరంలో
చివురించిన చెట్లకింద స్నేహితులతో దూరంలో
షికారుగా వెళ్లారు మీరు నదిమీద బోట్లో
దేవుని మొదటి అవతారం చేప కనబడింది నీట్లో

ప్రాగ్ నగరంలో హోటేలు దానిచుట్టూ ఒక తోట
టేబిల్‌మీద గులాబిపువ్వు దాన్ని చూడ్డం నీకో ఆట
వచనంలో నీ జీవితాన్ని వడగట్టడానికి బదులు
పరధ్యానంగా చూస్తావు నీక్కనబడుతుంది పువ్వులోని పురుగు

భయపడిపోయి చూస్తావు దేవాలయంలో విగ్రహాన్ని
నీ కళ్లు జాలిగా తోడుకుంటాయి పరమేశ్వరుడి ఆగ్రహాన్ని
లాజరస్‌వి అయావు నీవు నీ ఒళ్లంతా కుళ్లు
కుడినించి ఎడమకి తిరుగుతున్నాయి గడియారం ముళ్లు
మళ్ళీ నీ జీవితంలోకి మెల్లగా జారుకుంటావు
పల్లెల్లో పదాలు వింటావు వెల్లుల్లీ తిలపిష్టం తింటావు.

ఇదిగో ఇది ఇంకోవూరు
ఇంకో హోటేల్
ఇంకో దేశం
ఎన్ని నగరాలు చూశావు ఎంత ప్రయాణం చేశావు

మళ్ళీ నీ స్వగ్రామం నిలుచున్నావు జడ్జీముందర
నేరంచేసిన ముద్దాయివి శిక్ష వినాలని నీ తొందర
చాలా ప్రయాణాలు చేశావు సంతోషంగా దుఃఖంగా
సంవత్సరాలు పెరిగాయి నీమీద అబద్ధం కనబడింది అందంగా

ఇరవయ్యో ఏట ప్రేమ నీ ముప్పయ్యో ఏట ప్రేమనీ
చవిచూశాపు నువ్వు తెలిసింది వాటిరుచి చేదని.

పిచ్చివాడిలా బతికాన్నేను వ్యర్థమైనాయి నా దినాలు
చూడలేవు నీ చేతులు ఆగబోవు నా కన్నీళ్ళు

చూశావా ఈ కాందిశీకుల్ని అందరూ మనలాంటివాళ్ళే
దేవుణ్ని నమ్ముకున్నారు వీళ్ళు వాళ్లవీ మనలాంటి కళ్లే
కష్టపడి పెంచుకొస్తున్నారు బిడ్డల్ని రైలుస్టేషన్లలో చెట్లకింద
ఎప్పటికైనా మంచిరోజు లొస్తాయనుకొంటున్నారు ఏముంది
దీన్లో వింత

ఇంకో చోటికి పోయి బతకాలని
ఎలాగైనా ధనం ఆర్జించాలని
తర్వాత ఇంటికి వచ్చేసి సుఖించాలని ఆశ
బండమీద పచ్చడి నూరుతోందా అమ్మాయి
నీ గుండెల్ని నువ్వు నూరుతున్నంత సులువుగా
ఆ పచ్చడీ నీ గుండెలూ మన స్వప్నాలూ అన్నీ మిథ్య
కాందిశీకుల్లో కొంద రిక్కడే ఉంటారు మన మధ్య
చదరంగంలో బలం లాగ అరుదుగా కదుల్తారు
ఏదో వ్యాపారం చేస్తారు ఎలాగో బతుకుతారు.

సారాకొట్లో దూరేవు అలగాజనంతో చేరేవు
రాత్రి పెద్దహూ తేల్లోకెళ్ళి రాక్షసుడివిగా మారేవు

చెడ్డవాళ్ళు కారీస్త్రీలు తేలికకాదు వీళ్ళుమోసే బరువు
అందరూ తమ ప్రియులకి కష్టాలే కలిగించారు

అదుగో ఆ అమ్మాయి ఒక బీదఉద్యోగి కూతురు
ఆమె కడుపుమీద కుట్లని ఎవరు చేస్తారు ఖాతరు

అదుగో ఆ నల్లపిల్ల ఆమె నవ్వు అసహ్యం
తలవంచాను నమ్రంగా ఆమె దుఃఖం అనూహ్యం

ఒంటరిగా మిగిలిపోయావు పెంటనే ఉదయం వచ్చింది
పగలు చేసే చప్పుడు నగరంండా హెచ్చింది

నిశీధం పట్టుకుపోయింది నీకు నచ్చిన ముఖాలను
హాలాహలంలా మండే ఆల్కహాల్‌ను సేవిస్తావు
అంచులో కాలిపోతున్న నీ దినాలను చూస్తావు

ఒకొక్క వీధిలో ఒకొక్కడు కనబడతాడు
అందరిలోనూ దేవుణ్ణే చూస్తావు

చాలుచాలు పోదామ్మరి సాయంత్ర మయిపోయింది.

# చిన్న పిల్లల సర్కస్‌లో

## డిలాన్ థామస్

చిన్నపిల్లల సర్కస్‌లో
పిడేళ్ళు ధరించిన వర్తకులు
కష్టాలన్నీ మైమరచిన
కాలం అనేది ఉండేదా ?

గ్రంథాలమీదపడి వాళ్ళేడ్చే
కాలం ఒకటి ఉండేది.
కాలం అయితే వాళ్ళ మీదికి
కాష్ఠాన్నే ఉసికొల్పింది.

ఆకాశపు అర్ధవలయం కింద
ప్రమాదమైన బ్రతుకు వీళ్ళది
అజ్ఞేయం మాత్రమే ఈ లోకంలో
అత్యంత సురక్షితమైనది.

ఆకాశపు సంజ్ఞలకింద
హస్తాలు లేనివాళ్ళవే
అతి భద్రమైన చేతులు :

గుండెల్లేని శవానికి
గాయాలబాధ లేనట్లు
గుడ్డివాడు మాత్రమే
జాస్తిగా చూస్తాడు.

తాతా రమేశ్‌బాబు
కోశాధికారి
కృష్ణాజిల్లా రచయితల సంఘం
14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ
Cell: 9441518715

# పిచ్చి దానిమ్మ చెట్టు

తెల్లగా వెల్లవేసిన వసారాలో
అనుకూల దక్షిణ వాయువులు ప్రసరించే అందమైన
గదుల వెలుపల
ఇట్టే వెలుతురులోకి ఉరికేది
ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా, చెప్పవూ ?
ఉయ్యాలలూగే గాలుల గుసగుసలలో
సారవంతమైన తన సంతోషాన్ని వెదజల్లేది
ఎవరు చెప్పవూ, ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా ?
ఉదయవేళ అపుడే తొడిగిన మొగ్గలతో
ఊగుతూ ఉవ్వెత్తుగా తన రంగుల ఫించంవిప్పి
విజయగర్వ రోమాంచంతో కులికేది
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా ?
పాలికాపు బాలికలు పొలాలలో నగ్నంగా
నిద్ర బద్ధకపు లోతులు దులిపేస్తూ
లవంగాలు తమ పసిరిక చేతులతో పోగుచేసేటప్పుడు
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా ?
సూర్యకాంతిని వాళ్ళ తట్టలకెత్తేది ?
వాళ్ళు పిలుచుకునే పేర్లని పాటలతో ముంచెత్తేది ?
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా
ప్రపంచపు నీడలతో పోరాడేది ?
ఈసులాడి దినం తన్ను ఏడు నిగనిగని రెక్కలతో
అలంకరించుకొని

అనంత సూర్యబింబం చుట్టూ ఆకాశ హస్తాలను
చుడుతున్నప్పుడు

చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా
వెయ్యి కొరడాలు పుచ్చుకొని
దౌడుతీసే గుర్రాలను జూలులాగి నిలబెడుతుంది ?
ఒకసారి విషాదంతో, ఒకమారు విభ్రమిస్తూ
ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా చెప్పవూ
ఏదో నవీన ప్రభాతాన్ని ఎలుగెత్తి చాటుతుంది ?
ఓహో చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా
సుదూరంలో పరవళ్ళు తొక్కుతూ
వెయ్యిపడవల్ని కడుపుతో ఉన్న కడలిలాగ
ఇతరుల అడుగుజాడ లెరుగని తీరాలకు
విరగబడే కెరటాలు పంపుతూ
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా
ఆకుల పోకెట్ రుమాలు ఊపుతుంది ?
సరికొత్త నిప్పులు చెరుగుతుంది ?
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా
తేటతెల్లని గాలికి తెరచాప లెత్తుతుంది ?
నిర్లక్ష్యంగా ప్రమాదకరంగా
ద్రాక్ష లతల వినీల శిఖరాల మధ్య
వింపులతో, వీరావేశంతో
ఎవరు చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా
ప్రపంచపు నడుంమీద వెలుతురుతో విరుచుకుపడి
రాక్షసి తుఫానుల ప్రసారాన్ని ప్రతిఘటించి
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా

పంటలతో పాటలతో సరిగంచులు దిద్దిన
ప్రత్యూషపు పసుపుపచ్చని సింహపు జూలుపట్టుకొని
దివసకాంత కట్టుకున్న పట్టుచీరని
హఠాత్తుగా జారలాగివేస్తుంది ?
చైత్రమాసపు రవికలు ధరించి శ్రావణమాసపు
విపంచి ధ్వనించి
చెప్పవూ ఆడుకునే పాడుకునే ఈవిడ
బీభత్సాన్ని పట్టుకొని :ఊపేసి
కాటుక చీకటి నీడలు రాల్పించి
సూర్యుడి గోలెంలో మత్తెక్కిన పక్షుల్ని వొంపే ఈవిడ
సమస్త వస్తువుల హృదయాలలో
మన ప్రగాఢ స్వప్నాల గుండెలలో
విశాలంగా తన రెక్కలు విప్పుకునే ఈవిడ
ఎవరు ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా ?

[ఒడిస్యూస్ ఎలిటిస్ గేయానికి అనువాదం]

# మరీ ముఖ్యంగా ఒక మాఘమాసపు గాలి

డిలాన్ థామస్

మరీ ముఖ్యంగా ఒక మాఘమాసపు గాలి
మంచు వేళ్ళతో నాజుత్తును శిక్షించేటప్పుడు
పీతచేతుల సూర్యుడికి దొరికిపోయి నిప్పులమీద నడుస్తూ నేను
నేలమీద రచించగా ఒక పీతలాంటి నీడని
సముద్రతీరం వార విహంగాల రొదవింటూ
చలికాలపు కష్టాల్లో వింటూ మాలకాకి దగ్గులు
నా తొందరగుండె మాట్లాడుతూ వణకుతుంది
మాటల నెత్తురు కక్కుతుంది భాషని భూస్థాపితంగా పిండుతుంది

మరిన్ని మాటుమణిగి మాటల ప్రాకారంలో నేను
పరీక్షిస్తాను క్షితిజరేఖమీద చెట్లలా నడుస్తూ
మాటల రూపం ధరించిన మందయానల నెందర్నో
చుక్కల సంజ్ఞలు చేసే చక్కని పిల్ల బొరుల్ని చూస్తాను
కొన్ని నీకోసం చెయ్యనిస్తాయి అచ్చుల సరుగుడు చెట్లని పార్కులో
కొన్ని మర్రిచెట్ల కూతల్ని కొన్నిటి వేళ్లలోంచి
ముళ్ల పట్టణాలు బయల్దేరి మోహనగానం చేస్తాయి
కొన్ని చెయ్యనిస్తాయి నీకోసం మంచినీళ్ల ఉపన్యాసాలు

గోలెం మొక్కల వెనకాతల ఊగాడే గడియారం
కాలం వాక్కు చెబుతుంది నరాల్లోని అర్థం
ఎగురుతుంది చక్రబాణంమీద ఊదుతుంది ఉదయాన్ని
కోడి గొంతుకలో పొడిచిన పొద్దు వేడెంతో కొలుస్తుంది

కొన్ని చెయ్యనిస్తాయి నీకోసం మైదానాల సంకేతాలు
హెచ్చరికచే పచ్చిక నేను నేర్పినదంతా చెబుతుంది
పురుగు దొలిచిన శీతువుతో విరుచుకపడుతుంది కంట్లో
కొన్ని చెప్పనిస్తాయి నీకోసం మాలకాకి పాపాలు

మరీ ముఖ్యంగా ఒకానొక మాఘమాసపు గాలి
(కొన్ని చెయ్యనిస్తాయి నీకోసం శరత్కాలపు యజ్ఞాలు
సాలెపురుగు నాలుక వేల్సుకొండ గర్జన)
దుంపల పిడికిళ్లతో నేలను శిక్షించేటప్పుడు
కొన్ని నీకోసం చెయ్యనిస్తాయి గుండెల్లేని మాటల్ని
నిండుకుంటుంది హృదయం రాసానిక రక్తంలో
పల్లెవేస్తూ వర్ణక్రమాలు వచ్చే తుపాన్‌ని పసికడుతుంది
సముద్రతీరం వాత కాటుక మాటల పిట్టల్ని వింటుంది.

# చలికాలపు ఉదయం

అలెగ్జాండర్ పుష్కిన్

హేమంతం సూర్యకాంతి ! ఎంతమంచి దివసం !
ఇంకా నిద్రపోతావేం ? ఇది చక్కని ఉదయం !
సఖీ ! సుభగముఖీ, చాలు సిగ్గులేని మగత
ఆవలింత మాను, నిదురకనులు తెరువుసుంత !
ఉత్తర దిగ్గగనంపయి చుక్కలాగ వెలుగుమా !
ఉత్తర దిక్ప్రభాత శిఖ నెదురొక్కనుము ప్రియతమా !
నిన్నరాత్రి (నీకు తెలుసు) సుడిగాలుల కేకలో
పొగమంచుల పొరలు క్రమ్మె ఆకాశపు రేకుల్లో
పచ్చని ఒక మచ్చలాగ చందమామ చల్లగా
భయపెట్టె మబ్బుల్లో ప్రయాణించె మెల్లగా
పరితాపపు ప్రతిమలాగ ప్రాణసఖీ నీవు
కూర్చున్నావపుడు, ఇపుడో ? కిటికీ తెరిచి చూడు.
నీలినీలి నింగికింద రంగు తివాసీవలెనే
నీరెండలలో మిలమిలలాడి పొగసులాడి మంచు
నిద్రిస్తున్నది; నల్లని వస్తువన్నదే లేదు
చెట్లుమాత్రమే నల్లగ కొత్త కొత్త కనిపించును,
పొగమంచుల మడతలలో ఆకుపచ్చ సరుగుచెట్లు
అల్లవిగో ! మంచుకింద నది కంటున్నది కలలు.
ప్రాణసఖీ గుర్రాన్ని బండినీ పిలిపిస్తే
మరీ మంచిదనుకుంటా ప్రయాణాని కిదే అదను.

పదపోదాం ప్రణయినీ ఉషఃకాల హిమానీ మృదు
పథాలలో నీవు నేను, గుర్రపు డెక్కల చప్పుడు
వింటూ, బండీ గంటలు వింటూ పోదాం పదపద.
ఎవరులేని ఎవరు రాని పొలాలలో తిరుగుదాం
ఆకురాలి శూన్యమైన అరణ్యాల కరుగుదాం
నాకెంతో సుఖమిచ్చే నదివొడ్డుకు కదలుదాం.

# హేమంతం

## నికొలాయ్ నెక్రొసోవ్

ఎవరా వస్తున్నది చెట్లమీంచి గాలికాదు
మైదానంమీద దూకు నెలయేళ్లవి కావు కావు
తన మిహికా సామ్రాజ్యం తనిఖీ చేసేటందుకు
అదిగో హేమంతరాజు కోటవెడలి కదలినాడు
అడవిదార్లు మూసుకుపోయాయా లేదా ? హిమాని
కడు శ్రద్ధగ తన పని చేస్తున్నదా లేదా. ఈ
ధరణీతలమంతా ఏ యెగుడుదిగుడు లేకుండా
మంచు కప్పి ఉందా అని మరీమరీ చూస్తాడు
తేకుచెట్లు, తురాయిలు, ఓకుచెట్లు రంగవల్లి
సవరించాయా లేదా ? నెలయేళ్ళు పెద్ద నదులు
గడ్డకట్టి సమత్వాన్ని సాధించాయా లేదా ?
వస్తున్నా డతడు వృషివాటికలం దూగులాడి !
మంచుమీద అతని పదధ్వనులు మీరు వినలేదా ?
అతని తెల్లని గడ్డం అదిగో కనబడలేదా !

# గృహోన్ముఖంగా

వ్లాడిమిర్ మయకొవ్‌స్కీ

అట్టడుగు అగాధాలనుంచి
కష్టజీవులు కమ్యూనిజంలోని కొస్తారు :
గనుల గర్భాలనుంచి,
కొండవళ్ళలోంచి,
కార్ఖానాలనుంచి !
నేను :సమున్నత కవితా శిఖరాలనుంచి
కమ్యూనిజంలోకి దూకుతాను !
కమ్యూనిజం నా హృదయం, అది విన
నాకు ప్రేమలేదు !
ఎలాగైనా ఒకటే -
స్వయంగా ప్రవాసంలోకి పోయినా,
ఇతరులు నన్ను నిశ్శబ్దంలో నిర్బంధించినా,
ఉక్కుమాటలు తుప్పుపట్టి
రాగిబాకా నల్లబడుతుంది !
స్వదేశం ఆకర్షిస్తుంది నన్ను
విదేశీయ వర్షాలు నన్ను తడిపి ముద్దచేసి
నా మాటలను స్తంభింపజేస్తాయి !
సముద్రంమీద ప్రయాణిస్తూ
స్వదేశాన్ని సమీపిస్తున్న నేను
సంతోషాన్ని ఉత్పత్తి చేస్తున్న

సామ్యవాద రష్యా ఫ్యాక్టరీనని భావిస్తున్నాను !
అలసాలస లాలస హస్తాలు
అలవోకగా సాయంకాలం
తునిమి వాసనచూసి పారేసే
దారిపక్క పువ్వుని కాదలచుకోను నేను !
ప్రజారాజ్య మహాయంత్రంలో
ప్రత్యేకంగా నాచోట నిలబడి నేను
ప్రణాళికల ప్రకారం నా
పరిశ్రమను భరపోస్తాను !
ప్రజామంత్రి "కాలం" నా
భావాలమీద పరిభ్రమించి
ఆదేశానుసారంగా
"ఏదీ నీ కవిత్వం !" అని అడగాలి !
ప్రథమశ్రేణి కళాశీలి అని
ప్రజలు నన్ను ఆదరించాలి !
శ్రామికుల చట్టం నా
జీవితానికి వర్తించి
పని ముగిసినతర్వాత నేను
ఫ్యాక్టరీ బైటికి రావాలి !
పొలిట్‌బ్యూరో ఎజెండాలో
ఒకటో నంబరు పద్దు !
కవిత్వ పరిశ్రమమీద
స్టాలిన్ సమర్పించగల రిపోర్టు :

"ఇదిగిదిగో ఇలా ఇలా
అదిగదుగో అలా అలా
అడుగున పడివున్న శ్రమజీవులు
అగ్రశాఖ లందుకున్నారు :
దేశంలో యుద్ధానికి పూర్వంకన్న ఇప్పుడు
కవితా మాధురీ రసాస్వాదనలో
ప్రజలస్థాయి బ్రహ్మాండంగా పెరిగింది"

# వ్లాడిమిర్ ఇల్యిచ్ లెనిన్

వి. మయ్‌కొవ్‌స్కీ

ఇదే అదను లెనిన్ కథను
రచించెదను నేను
లెనిన్ బ్రతుకు జనంకొరకు
ధ్వనించెదను నేడు
మనోవేదన నాలోన
నశించెనని కాదు
విశాలమగు విషాద గుహ
వసించితిని నేడు
లెనిన్ కథాక్రమం సదా
జపించితిని నేను
విషాదాశ్రు తుషారాల
నిషా నాకు లేదు
లెనిన్ నేడు లేడూ ? చూడు
జనంలో ఉన్నాడు
లెనిన్ వేడి లెనిన్ వాడి
జగంనాడి, ధమని
లెనిన్ శాంతి లెనిన్ కాంతి
లెనిన్ మనకు ద్యుమణి
కామ్రేడ్ లెనిన్ ఛత్రం, ప్రేమ
సామ్రాజ్యానికి చిహ్నం,

కామ్రేడ్ లెనిన్ క్షేత్రం, శాత్రవ
దుర్మార్గాల లవిత్రం
లెనిన్ పరాకాష్ఠ లెనిన్
లెనిన్ మన పరాక్రమం
కామ్రేడ్ లెనిన్ ఆయుధం
మన ఆసరా, మన జ్ఞానం

లెనిన్ దృష్టి లెనిన్ సృష్టి
లెనిన్ మన నిధానం.....
లెనిన్ లెనిన్ లెనిన్ లెనిన్
లెనిన్ మన ప్రమాణం
లెనిన్ మనం మనం లెనిన్
లెనిన్ మనం ప్రయాణం
నీలో నాలో నీతో నాతో
లెనిన్ మహా ప్రవాహం

*  *  *

ప్రజలు నౌకలు
పౌడినేల అడ్డంకాదు
ఇప్పుడులో జీవిస్తూ మనం
ఈ నౌకను పట్టిన తుప్పుడు విదిలించి
పడవ చెక్కలికి అంటుకున్న
మున్నపు గుల్లలు డుల్లించి

తుప్పు వదలించి
తుపానులను జయించి
సూర్యకాంతికి సమీపంగా
దించి లంగరు,
నౌకాయాన ప్రయాసం
పెరిగిన గడ్డాల నాచు
సముద్రపు చెత్త
పరిహరించి పరిశుభ్రంగా స్నానం చేద్దాం.

లెనిన్‌లో స్నానంచేసి
పునీతుణ్ణవుతున్నాను
విప్లవ సముద్రంలో
ఇంకొ ఇంకొ దూరానికి
ఈ పడవ నడుపుతున్నాను.
అయినా ఏం కవిత్వం ఇది ?
అమాయిక బాలుడు కావ్యం అంటే
భయపడినట్టు
భయపడుతున్నాను ఈ అక్షరాలు
లిఖించడానికి :

కిరీటధారి లెనిన్
అతనికి సముచితమైనదేనా
ఈ నా కవిత్వం ?
లెనిన్‌కి తగ్గ

కవిత్వం ధ్వనించాలంటే
అనంతాకాశాన్ని చుంబించే
అతని కిరీటాన్ని తాకాలంటే
ఈ నా శక్తిలేని వాక్కులు
ఆ మానవుణ్ణి అర్థం చేసుకోవద్దూ ?

ఆ ప్రదీప్త విశాల లలాటానికి నా మాటలు
అడ్డుపడే తెరలు కాకూడదు
అధికార లాంఛనాలంటే
అసహ్యం నాకు;
ప్రభుత్వం పురమాయించిందని
పద్యం రాయలేను నేను ;
లెనిన్ నా కనుపాప !
క్షుద్ర కావ్యంతో అవమానిస్తానా ?
హృద్రక్తం ఉప్పొంగి రాస్తున్నాను.
అంతరాత్మ శాసనాన్ని
అంగీకరిస్తున్నాను.
ఇది నా విధి
ఈ నా ధర్మం నిర్వహిస్తున్నాను.

*  *  *

మాస్కో సమస్తం
గడ్డ కట్టిన రాత్రి
గజగజ వణికింది.

గజ్జె కట్టిన రాత్రి
గణగణ మ్రోగింది.

కాదు హారన్ల మ్రోత.
విద్యుద్దీపాల కూత !
విద్యుద్దీపాల రాత్రి
వెలుతురు జాగరం చేస్తోంది.

ఎక్కడనుంచి వచ్చాడు ?
ఎవరాయన ?
ఏం చేశాడు ?
ఏమిటీ జనసమ్మర్దం ?
ఎవరి కింత మర్యాద ?
జ్ఞాపకాల ఖజానాలోంచి
ఒక్కొక్క మాటనే తీస్తున్నాను.
గొంతుకమాత్రం పెగలదు.
నోటిదాకా వచ్చిన
మాటలు దిగజారుతున్నాయి.

స్తంభించిన శబ్దప్రపంచం
మాటల ఫ్యాక్టరీ పని చెయ్యదు.
అతణ్ణి స్పష్టంగా వర్ణించడానికి
అగపడవేం మాటలు ?

వారాని కేడురోజులు మనకి.
రోజు కిరవై నాలుగు గంటలు.

వాడుకో, మానుకో అంతే -
అంతే జీవితం:
హఠాత్తుగా వస్తుంది మృత్యువు.
అడక్కుండా తీసుకుపోతుంది.

గడియారాన్ని బద్దలు చేసుకొని
కాలం ప్రవహిస్తే
పంచాంగాల ఆవరణ దాటి
కాలం పరుగెత్తితే
"అహో! అదోశకం" అంటాం;
"ఓహో! అదోయుగం" అంటాం.

రాత్రిపడగానే నిద్రిస్తాం
పగ లేవో పనులు
నలుపుని తెలుపు చేస్తాం
సోమరితనాన్ని సమర్థిస్తాం!

కాని ఒకొనొకడు మనకోసం
చరిత్రగమనాన్ని శాసిస్తే
"వాడుగో ఒక ప్రవక్త" అంటాం;
"చూడరా ఒక ప్రతిభాశాలి" అంటాం;
మనం పెద్ద పరుగులకి పోము.

పిలవనిదే కదలం.
పెళ్లాలని ప్రేమిస్తాం.
స్థబ్ధుగా జీవిస్తాం.
శరీరం ఆత్మా ఒక్క లయకు
స్పందించే మహానుభావుడు వస్తే
"క్షేత్రవర్ధస్వి" అంటాం
"దైవప్రసాది" అంటాం
"వాడెపో మగవా" డంటాం
"వాడుగో మొనగా" డంటాం
అదీ మామూలు పద్ధతి.
తెలివీ కాదు మూర్ఖంకాదు
అర్థంలేని మాటలు.
మంచులా కరిగిపోయే మాటలు.

ఈ నిర్జీవపు గుడ్లలోంచి
భావాలను పొదగలేము
మామూలు ఊహలతో
మహత్వాన్ని కొలవలేము
చేతులూ మెదడూ చాలవు
అతణ్ణి తెలుసుకోవడానికి:
ఈ కొలతలతో నా లెనిన్
ఎవరని నిర్ణయించేది ?

మహాకవి

# శ్రీ శ్రీ రచనలు

1. మహాప్రస్థానం .... రు. 1-25
2. మూడు యాభయిలు .... రు. 1-00
3. గురజాడ .... రు. 1-25
4. 1 + 1 = 1 మొదలైన రేడియో నాటికలు .... రు. 2-00

[ పోస్టేజి అదనం ]

★

ప్రతులకు :

విశాలాంధ్ర ప్రచురణాలయం
ఏలూరు రోడ్డు :: విజయవాడ-2

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజార్ :: హైద్రాబాద్

Wrapper Printed at Swatantra Art Printers, Vijayawada-4